# I. స్తుతి ప్రార్థనలు

## స్తుతి ప్రార్థన

**ప్రార్థన:–** ఓ దేవా! మీరు మిమ్మల్ని మాకు బయలుపర్చుకొన్నారు గనుక మీకు స్తోత్రములు. మీ లక్షణములు బైలుపర్చుకొన్నారు మీకు స్తోత్రములు. మీ లక్షణములు మాకు ఇచ్చినారు మీకు స్తోత్రములు. మీ లక్షణములను గురించి మీ వాక్యములో కూడా వ్రాయించినారు గనుక మీకు స్తోత్రములు. మీ లక్షణములను ఉదహరించి బోధకులద్వారా వివరించినారు గనుక మీకు స్తోత్రములు. మీ లక్షణములు మేము కూడ వాడుకొనేటందుకు మాకు స్వాతంత్ర్యము ఇచ్చినారు గనుక మీకు స్తోత్రములు. మీరు అన్ని ఇచ్చి, స్తుతించే లక్షణము ఇవ్వకపోతే అన్ని ఇచ్చినా ప్రయోజనముండదు. అయితే వాడుకొనే స్వతంత్రత ఇచ్చినారు గనుక మీకు స్తోత్రములు. ఆమేన్.

ఓ దేవా! భూమిక్రిందనున్న నీళ్లలోనున్న ఇసుక రేణువులు మొదలుకొని ఎత్తైన కొండల వరకు, ఇంకా ఎత్తైన మేఘములవరకు, ఇంకా ఎత్తైన నక్షత్రముల వరకు ఉన్న సమస్తమును మా నిమిత్తమై కలుగజేసిన మీకు స్తోత్రము.

ఓ దేవా! మీరు సమస్తమును కలుగజేసిన రీతిగా, నరుడుకూడా కొన్నింటిని కలుగజేసే శక్తిమంతునిగా మార్చినారు గనుక మీకు వందనములు. చిన్న సూది మొదలుకొని ఆకాశములో ఎగిరే విమానముల వరకు ఉన్నవాటిని నరుడు కలుగజేసేటందుకు జ్ఞానము, శక్తి, కాలక్రమేణ, సమయస్ఫూర్తి వాటిని వాడుకొనే కృప దయచేసినారు గనుక మీకు స్తోత్రములు.

యేసుక్రీస్తు ప్రభువా! సైతానుయొక్క సృష్టిని లయపర్చుటకు వచ్చినారు గనుక మీకు స్తోత్రములు. దానిని ఇప్పుడే ఆరంభించినారు. వెయ్యేండ్ల పరిపాలనకు ఆ పనిని ముగిస్తారు. కాబట్టి మీకు వందనములు. ఆదికాండము మూడవ అధ్యాయములో ఆరంభించి ప్రకటన గ్రంథము చివరివరకు ముగింపనైయున్న ఈ మీ యొక్క పని నిమిత్తమై, ఆ పిదప సృజించు మీ గొప్ప నూతన సృష్టి నిమిత్తమై మీకు అనేక వందనములు. అది మాత్రమే కాకుండా విశ్వాసులను శుద్ధిచేసి, పరలోకమునకు, చేర్చుకొనుచున్నారు. కాబట్టి మా విషయములో జరుగవలసిన నూతన సృష్టికొరకు కనిపెట్టుచున్నారు. అట్లు కనిపెట్టుటకు మీ వాక్యమును వ్రాయించినారు, మీకు వందనములు. ప్రతి దినము సాయంకాలము ఐదు గంటలకు పిచ్చుకలు సన్నిధి కూటము చేయును, అట్లే ఉదయమున కూడ చేయును. సమయమును అవి వ్యర్ధపరచుటలేదు. యెషయా 43:20 వచనములో అవి మిమ్మును ఘనపరుచుట చూచుచున్నాము, అట్లే ఇక్కడ నీళ్లు దొరుకక ఇటు అటు తిరుగాడు కుక్కలు, కారుకోళ్లు (నిప్పుకోళ్ళు) ఇప్పుడు నీళ్లు త్రాగి దేవుని స్తుతించుచున్నవి.

ఓ ప్రభువా! జీవరాసులు, మృగములు, పక్షులు మిమ్మును అంతగా స్తుతించుచుంటే నరులమైన మేము ఇంకా ఎంతగా స్తుతించవలెనో అట్లు స్తుతించేటందుకు కావలసిన శక్తి దయచేయుము. ఎవరుకావలె-నాకెవరు కావలె అను కీర్తనలోని ఐదు విషయములు జ్ఞాపకము చేసిన ప్రభువా! మీకు వందనములు. జీవితమంతా ఆలాగు చేయు శక్తి దయచేయుము. ఆమేన్.

## త్రికాల స్తుతిహారము

**త్రియేక స్తుతి:-** ఓ దేవా! మీరు యిర్మియా ప్రవక్త ద్వారా వ్రాయించినట్లు కలిగే స్తోత్రమునకును, దుఃఖకాలమందు కలిగే స్తోత్రమునకును మీరే కారకులైనందున స్తోత్రమునకు మీరే

కారకులైయున్నారు గనుక మీకు అనేక స్తోత్రములు మాలో సౌఖ్యకాలమందు ఉన్నందుకు సోత్రములు. ఓ ప్రభువా! ఈ రెండు సమయములందు కలిగే స్తుతులు వేటికవే కళ కాంతులు గలవి అని గ్రహించే మనస్సు దయచేయుము. ఓ దేవా! మా జీవిత కాలములో మాకు జరిగే మంచి చెడ్డలను బట్టి, ఇతరులకు కలిగే మంచి చెడ్డలను బట్టి మా హృదయములో మీకు ఇష్టమైన స్తుతి ఊరేటట్లు, స్వభావ సిద్ధముగా ఊరేటట్లు మీ కృప దయచేయుము. మా బలహీనతలు ఒప్పుకొనే సమయములో ఒప్పుదల స్తుతియును, తీర్మానించుకొనే సమయములో తీర్మాన స్తుతియును, ప్రార్థించే సమయములో ప్రార్థనా స్తుతియును, స్తుతించే సమయములో కేవలం స్తుతియును మాకు వచ్చే నైజదోరణి అనుగ్రహించుము. మరియు మేము ఏ పని చేసినను, స్తుతి దయచేయుము, స్తుతి లేకుండా చేయకుండునట్లు కృప దయచేయుము, మా బ్రతుకంతయు స్తుతిగల బ్రతుకైయుండే కృప దయచేయుము. మా నైజము చొప్పున స్తుతి వచ్చినను, మా వల్లనే వచ్చినదనే అతిశయము మాలోనికి రాకుండచేసి, మీవల్లనే వచ్చినదనే సంతోషము అనుగ్రహింపుము. ఓ దేవా! ఏదైనా ఒక మంచి పని చేయవలెననే తలంపు మాలోనికి వచ్చేటప్పుడు, ఆ తలంపు నిమిత్తమై మిమ్మును స్తుతించేటట్లును, ఆ పని చేయకముందే మీరు సఫల పర్చెదరనే విశ్వాసముతో మిమ్ము స్తుతించేటట్లును మాకు దయచేయుము. ఆమేన్.

త్రియేక దేవా! మీరు భూతపర్తమాన భవిష్యత్ కాలములో నుండువారనియు, పరిశుద్ధులనియు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని పొగడుబడుచున్న వారనియు మేము మిమ్ములను స్తుతించుచున్నాము.

1. దేవా! మీరు గతకాలమందు అనగా అనాదికాలము నుండి ఆదికాలము వరకు, ఆది కాలమునుండి మా జన్మకాలము వరకును, ఈ నిమిషము వరకును, ఈ గడిచిన కాలము వరకును ఉన్నట్లు; ఇందు

విషయమై మీకు అనేక స్తోత్రములు. అనాది కాలములో నన్ను గూర్చి ఆలోచించుచున్న దేవా! మీకు స్తోత్రము, మీ ప్రేమకు స్తోత్రము. ఆదికాలమందు నన్ను గూర్చి ఆలోచిస్తున్న దేవా! మీకు స్తోత్రములు. నా జన్మకాలము మొదలుకొని నేటివరకు నన్ను కాపాడుచున్న దేవా! మీకు స్తోత్రము. మీరు మీయంతటట మీరే స్వయముగా ఉండే దేవుడవే కాక, ఆ విధముగా ఉండడం నా విషయమైకూడ ఉంటున్నారు గనుక ఆ ఉండడం నిమిత్తమై మీకు అనేక స్తోత్రములు.

2. వర్తమాన కాలములో ఉంటున్న దేవా! మీకు స్తోత్రము. ఇప్పుడనియు, నేడనియు, ఈ వేళనియు, ఈ నెలనియు, ఈ సంవత్సరమనియు మేము అనుకొంటున్న వర్తమాన కాలములో ఉన్న మీకు స్తోత్రము. మీరు ఉండడము వలన క్రియలతో కూడినదై ఉండడమైయున్నది. గనుక మీ ఉండడము నా మేలు నిమిత్తమై ఉన్నందుకు స్తోత్రము. వర్తమానకాలము, భవిష్యత్కాలమంత పెద్దది కాకపోయినను, ఈ కాలములో కూడ మీరు మా దగ్గర ఉన్నారు. కాబట్టి మీరు ఉండడమువల్ల మా వర్తమానకాలము కూడ ధన్యతగల కాలమైయున్నందుకు మీకు స్తోత్రములు.

3. రాబోవు కాలమందు ఉండే దేవా! మీకు స్తోత్రములు. రాబోయేకాలమునకు ఆదిలేనట్లు, రాబోయే కాలమునకు అంతమే ఉండదు. అట్టి కాలములో కూడ మీరు మాతోనే ఉండుదురని మీకు స్తోత్రము చెల్లించుచున్నాము. ఎల్లప్పుడు యుగయుగములందు మా దగ్గరనే ఉండే దేవా! మీకు స్తోత్రము. మరియు ఎల్లప్పుడు యుగయుగముల వరకును మాతో ఉందురని సెలవిచ్చెన దేవా! మీ మహా దివ్యమైయున్న వాగ్దానము వల్ల మాలో ప్రేరేపణ కలిగించే విషయమై, ఇన్ని మీ వాగ్దానములు నెరవేరే విషయమై మీకు అనంత స్తోత్రములు. అనాది దేవుడవైన మీరే, ఈ వర్తమాన దేవుడవైన మీరే, మాకు భవిష్యత్కాలపు

దేవుడవై కూడ ఉందురు. అది మా సంతోషము, ఇది మా రక్షణానందము, మా మహిమానందము. ఇది మమ్మును ముందుకు ఆకర్షించే ఆనందము. గనుక మీకు అనేక స్తోత్రములు. నిన్న నేడు నిరంతరము ఒక్క రీతిగానే ఉండే త్రియేకదేవా! మీకు స్తోత్రము.

# దేవుని ఔన్నత్య స్తుతి ప్రార్థన

దేవా! కాలము లేనప్పుడును, ఏమియు లేనప్పుడును మీరున్నారు. ఈ మీ గొప్పతనము విషయమై అనేక వందనములు. బి) కాలము, వస్తువులు, దూతలు, మనుష్యులు, లేకపోయినను; ఇవన్నియు, వీటి చరిత్రయు మీ మనస్సులో ఉన్నవి. ఈ గొప్పతనము నిమిత్తమై మీకనేక వందనములు. సి) మీరు పలానప్పుడు నుండి ఉన్నారని అనుకొంటే మీరప్పటికి ముందునుండే యున్నారు. అదికూడ అనుకొంటే ఆ ముందుకు ముందే మీరు ఉన్నారు. ఈ మీ గొప్పతనము నిమిత్తమై మీకనేక వందనములు. ఆమేన్!

# కష్టకాల స్తుతి ప్రార్థన

**దేవుని ప్రార్థించినయెడల యిప్పుడు ప్రవేశించిన జ్వరాలు అంతరించును.**

1. దేవా! ఆకాశమును, భూమిని కలుగజేసిన సృష్టికర్తా ! మమ్మును కలుగజేసిన తండ్రీ ! మీకు అనేక నమస్కారములు. 2. మా పాపములు క్షమించుము. 3. ఇకమీదట మాకు తెలిసిన ఏ పాపము చేయకుండ మాకు శక్తి దయచేయుము. 4. మా జబ్బు తీసి వేయుము. 5. మాకు పూర్ణారోగ్యము అనుగ్రహించుము. 6. మమ్మును లోకములోని వారందరిని దీవించుము. 7. మీ విషయములు, మీ పద్ధతులు, మీ బోధలు, మీ ప్రేమ తెలిసికొనగల జ్ఞానశక్తిని మాలో పుట్టించుము. 8. దేవా! మిమ్మును తప్ప ఎవరిని ఆరాధింపము. మిమ్మును తలంచుకొని, మీకే మ్రొక్కి, మిమ్ములనే ప్రార్థించుచు మరియు మిమ్ములనే నమ్మికొందుము.

**దేవుని ఎట్లు స్తుతించిన యెడల మన కష్టములు తీరునో ఆ సంగతులు ఈ ప్రార్థనలో ఉన్నవి.**

"వారు కృతజ్ఞతార్పణలు చెల్లించుదురుగాక" ఉత్సాహ ధ్వనితో ఆయన కార్యములను ప్రకటించుదురు గాక! (దా. కీర్తనలు 107:22).

**ఈ స్తుతి అత్యధిక సంతోషముతో చేయవలెను :**

**(1)** ఓ దేవా! నా పాపస్థితిని నిర్మూలము చేయుటకై ఒక పనిముట్టగా ఈ కష్టమును రానిచ్చుచున్నారు. గనుక ఈ మేలు నిమిత్తము మీకు వందనములు. **(2)** ఈ కష్టమున్నంత కాలము నేను మీ తట్టు తిరిగి ఉండునట్లు చేయుటకై, ఈ కష్టకాలము రానిచ్చుచుంటిరి. కాబట్టి మీకు వందనములు. **(3)** నేను మిమ్మును నమ్ముకొని, విశ్వాసమును అభ్యసించుటకై ఈ కష్టము ఇంకను ఉంచినారు గనుక వందనములు. **(4)** కష్టములో ఓపికను నేర్చుకొనుటకై కష్టమును ఇంకను ఉంచినారు. గనుక మీకు వందనములు. **(5)** నా ఆత్మీయ జీవితములో అవసరమైన వాక్యపఠనము, ప్రార్థనాభ్యా సము, వాక్యప్రకటన మొదలగు వాటి మీద మరింత గొప్ప ఆశ కలిగించుటకై ఈ కష్టకాలములను ఇంకా ఉంచినారు గనుక మీకు వందనములు. **(6)** మీ సహవాస భాగ్యము నాకు బాగుగా లభించుటకై కష్టములు రప్పించినారు గనుక మీకు వందనములు. **(7)** నేను పరలోక మహిమకై సిద్ధపడుటకు, ఈ కష్టమును రప్పించుచుంటిరి. గనుక మీకు అనేక వందనములు. **(8)** సుఖకాలమందు మిమ్మును మెచ్చుకొనుట మాత్రమేగాక, కష్టకాలమందు కూడా మెచ్చుకొనుటకై ఈ కష్టమును కల్పించుచుంటిరి. గనుక మీకు వందనములు. **(9)** సదా మిమ్మును స్తుతించుచు మిమ్మును నమ్ముకొని యుండుట, తరచుగా మీ గ్రంథములో మాటలు వినుట, మిమ్మును గురించి సదా ఆనందించుట మొదలగు ఈ చర్యల వలన ఈ కష్టస్థితిని సంపూర్ణముగా నేను జయించుటకు, దీనినింకా ఉండనిచ్చుచున్నారు. గనుక మీకు అనేక స్తోత్రములు.

# II. స్వీయ ప్రార్థనలు

## సామాన్య ప్రార్థన

ఆది అంతములేని తండ్రీ ! ఆకాశమును భూమిని భూమిమీద ఉన్న సమస్తమును, నన్నును, లోకములోనున్న మనుష్యులందరిని సృజించిన సృష్టి కర్తా! మీ జ్ఞానముచేతను మీ స్వశక్తిచేతను వీటినన్నిటిని కలుగజేసిన తండ్రీ! మనుష్యుని పెట్టవలసిన స్థలములో పెట్టిన తండ్రీ! ఆది మనుష్యులు మీకు విరోధముగా పాపము చేసినప్పుడు, వారిని శిక్షింపలేదు. గాని వీరు తెలియక సైతాను శోధనలో పడిపోయినారు గనుక వీరిని రక్షింపవలెను అని మీ మనస్సే చెప్పగా దాని ప్రకారము చేసిన తండ్రీ ! మీకు స్తోత్రములు.

మనుష్యుడు పాపమువలన పడిపోయి, ఇక మిమ్మును చూడలేక పోయినప్పుడు, మీ జ్ఞానము వలన కుమారుని భూమిమీదికి పంపవలసి వచ్చెను. కుమారుడు భూమిమీదికి వచ్చి ఇట్లు చెప్పెను, మీరు నన్ను వెతకి కనుగొనిన, తండ్రిని కనుగొన్నట్టే; నన్ను చూచినయెడల, తండ్రిని చూచినట్టే; పరిశుద్ధాత్మ మీలో ఉన్నప్పుడు అనగా, మీరు యెహోవాయందు భయభక్తులు కలిగి తన కృపకొరకు కనిపెట్టుచున్న యెడల తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ మీలో ఉన్నట్టె అని నాకు బైబిలుద్వారా చెప్పుచున్న తండ్రీ! బైబిలు ద్వారా గాక మాతో స్వయముగా మాటలాడి చెప్పుచున్న తండ్రీ ! ఇది ప్రజలు గ్రహించునట్లుగా సహాయము చేయుమని ప్రార్థన చేయుచున్నాను.

ప్రభువా! లోకములో బీదలు అనేకులు బాధపడుచున్నారు గనుక తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ! మీ పాదముల యొద్ద మనవి చేసికొనుచున్నాను ప్రభువా, అదేమనిన అనేకులు బీదవారు అన్నము లేక, బట్టలులేక ఉండుటకు, ఇల్లు లేక బాధపడుచున్నారు. మరియొకటి అదేమనిన తల్లిలేని బిడ్డలును, తండ్రిలేని బిడ్డలును, సహాయము చేయువారు లేక బాధపడుచున్నారు ప్రభువా! మరియొకటి ఏమనిన ప్రభువా ! అనేక

విధములైన వ్యాధులతో గృహములలోపడి, ఆసుపత్రులలో ఉండి, దిక్కుదోచక బాధ పడుచున్నారు గనుక ప్రభువా ! వారికి మీ ఉచితమైన కృపనుబట్టి మీరు మా పాపముల కొరకును, మా రోగముల కొరకును, శిలువ మరణము పొంది ఉచితముగా సిద్ధపరచిన ఈ రక్షణవైపు, అనగా నా వైపు చూచి, రక్షణ పొంది విశ్రాంతిలో ప్రవేశించుడి అని పిలువుము ప్రభువా! వీరి నిమిత్తము నేను చేయుచున్న మనవి ఏమనిన - ఈ లోకములో అనేకులు వీటన్నిటివలన హింస పొందుచున్నారు గాని, ఆత్మ సంతోషమును, ఆత్మ ఆనందమును, మీరిచ్చు రక్షణను తెలియకున్నారు గనుక తండ్రీ! అట్టివారికి ఇట్టి రక్షణ, మనసానందమును కలుగజేయుమని మనవి చేయుచున్నాను.

ప్రభువా ! నేను కూడా ఆలాగే జీవించుచున్నానో లేదో నాకు తెలియదు. ప్రభువా ! నా ఇరుగు పొరుగు వారితోను, నా ఇంటివారితోను, నా సహమానవులతోను, నా బంధువులతోను, నా స్నేహితులతోను, నిజమైన రాకడ విశ్వాసులతోను, సమాధానముగా ఉన్నానో లేదో నాకు తెలియదు గనుక నన్ను నేనే పరీక్షించుకొనుటకు నాకు సహాయముచేయుమని అడుగుచున్నాను తండ్రీ! ఆమెన్.

## అనుదిన ప్రార్థన

1. సర్వశక్తిగల దేవా! అనేకమంది రోగులను బాగుచేసినారు. మమ్ములను కూడా బాగుచేయుము.

2. అనేకమంది అనారోగ్యవంతులకు ఆరోగ్యమిచ్చినారు. మాకు కూడా ఆరోగ్యము దయచేయుము.

3. అనేకమందికి వ్యాధి లేకుండ చేసినారు. మాకు కూడా వ్యాధి లేకుండ చేయుము.

4. అనేకమందికి మీ వాక్యము వినిపించినారు. మాకును మీ

వాక్యము వినిపించుము, బోధించుము.

5. అనేకమందికి మీ వాక్యప్రకారము నడుచుకొను శక్తి ఇచ్చినారు. మాకు కూడా అట్టి శక్తి ఇమ్ము.

6. అనేకమందికి ఏదో ఒక వరమిచ్చినారు. మాకు కూడా మీకిష్టము వచ్చిన వరము ఇమ్ము.

7. అనేకమందికి మీ సేవచేయు సమయము, శక్తి ఇచ్చినారు. మాకు కూడా అట్టి సమయము, శక్తిని ఇమ్ము.

8. అనేకమందికి మీ సన్నిధిలో సమస్త అంశముల ప్రార్ధనలను చేసే సమయము ఇచ్చినారు. మాకు కూడా అట్టి తరుణము దయచేయుము.

9. అనేకమంది ద్వారా మీరు కీర్తి పొందినారు. మాద్వారా కూడా కీర్తి పొందుము.

10. అనేకమందికి శత్రుబాధ తొలగించినారు. మాకు కూడ శత్రు బాధ తొలగింపుము.

11. అనేకమందిని విషసంబంధమైన పురుగులనుండి, దుష్ట మృగములనుండి తప్పించినారు, గనుక మమ్ములను కూడ వాటి నుండి తప్పించుము.

12. అనేకమందిని అవమానము నుండి తప్పించినారు, గనుక మమ్ములను కూడ తప్పించుము.

13. అనేకమందిని శీతోష్ణాది భేదముల నుండి తప్పించినారు, గనుక మమ్ములను కూడ తప్పించుము.

14. మమ్ములను ఏ ఉద్దేశ్యముతో కలుగజేసినారో ఆ ఉద్దేశ్యమును నెరవేర్చువరకు మమ్ములను విడిచిపెట్టకుము.

15. అనేకమందికి ఉన్న ఆటంకములను తొలగించినారు, గనుక మాకు కూడ ఉన్న ఆటంకములను తొలగించుము.

16. మాలో ఎవరికి మరణము అవసరమో వారికి నెమ్మదిగల మరణమిమ్ము.

17. మాలో ఎవరు రెండవరాకడకు సిద్ధపడవలెనో వారిని సిద్ధపర్చుము.

18. మా దర్శనములన్నియు నెరవేర్చుము. మా మంచి ఊహలు, కోర్కెలు నెరవేర్చుము.

19. మా జీవిత కాలమంతయు మీ తలంపుతో నింపుము.

20. అధైర్యము, అవిశ్వాసము, భయము, తాత్కాలిక భక్తి అనునవి మాలోనికి రాకుండ కాపాడుము.

21. మేము మా ప్రార్థనలో ఏవి విడిచిపెట్టినామో, అవికూడ మీకు సమర్పించుచున్నాము.

22. మరియు మమ్ములను, సర్వజనులను, మృగాదులను, పక్షులను, వృక్షాదులను, మీ సర్వసృష్టిని కాపాడుము.

23. ఎప్పటికప్పుడే సాతాను యొక్క క్రియలను లయము చేయుము.

24. మా జీవిత కాలమంతయు, మీ దేవదూతల యొక్క సహాయమును అనుగ్రహింపుము.

25. మా అజ్ఞానము, మా అయోగ్యత, మా పాప స్థితి ఎప్పటికప్పుడే తొలగించుము, పరిశుద్ధ స్థితిలో స్థిరపర్చుము.

26. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అను త్రియేక దేవుడవైన మీరు, మాకు ఇచ్చిన వాటిలో ఏమియు పోగొట్టుకొనకుండ కాపాడుము.

27. అన్ని మంచి విషయములలో మాకు సమృద్ధి కలుగజేయుము.

Bible Mission HQ Guntur

28. మేము భూలోకములో ఉన్నప్పటికిని మా పేర్లు పరలోకములో మీ కుమారుని ద్వారా రిజిష్టరు (నమోదు)చేయుము.

29. మీ కుమారుడైన క్రీస్తు ద్వారా మీకు ఆది స్తుతి, మధ్య స్తుతి, జీవాంత స్తుతి, కష్టకాల స్తుతి, ఆనందకాల స్తుతి, ఏమియు తెలియక తోచక ఉండు కాలమందలి స్తుతియు, మా ఘటము యొక్క స్తుతియు, మా జన్మము మొదలుకొని కడవరి భూలోక నిమిషము వరకు ఋణపడే స్తుతియు, పరలోక స్తుతియు, అంగీకరించుమని మిక్కిలి వినయముతో వేడుకొనుచున్నాము. ఆమేన్.

## ఉదయమున లేచినప్పుడు చేయవలసిన ప్రార్థనలు

1. ప్రేమగల తండ్రీ! మా మీదనుండి గడిచిపోయిన రాత్రికాల విపత్తుల నుండి కాపాడి, ఈ ఉదయమున మమ్ములను లేపి, మరియొక దినము అనుగ్రహించినందుకు మీకు వందనములు ఆమేన్.

2. సృష్టికర్తవైన తండ్రీ! నేటి దినమున నేను చేయవలసిన పనులలో నాకు తోడైయుండుటకు మీరు కూడ నాతో కలిసి పనిచేయు తండ్రివై ఉండుము. ఆమేన్.

3. ప్రభువా! మా ప్రవర్తన వలన నేటి దినమును పరిశుద్ధ దినముగా బైలుపరచుకొను ప్రవర్తనా శక్తి కలిగించుము. ఆమేన్.

4. దేవా! ఈ దినమున మీరు నాకు ఏమి చెప్పనైయున్నారో అది నాతో చెప్పుము. ఆమేన్.

5. రక్షకుడవైన దేవా! ఈ దినమందు మమ్ములను వేటినుండి రక్షింపవలెనో వాటినుండి రక్షింపుము. ఆమేన్.

6. మాకాపరివైన ప్రభువా! మమ్మును యే దారిని నడిపింప దలచుకున్నావో ఆ దారిని నడిపింపుము. ఆమేన్.

7. దానకర్తవైన ప్రభువా! మేము అనుభవించుటకు ఈ వేళ మాకు ఏమి అందించెదవో, అవి అందుకొనే సమర్థత దయచేయుము. ఆమేన్.

# భోజనము చేయునప్పుడు చేయవలసిన ప్రార్థన

1. మా పోషకుడవైన తండ్రీ! మేము జీవించునట్లు ఆహారమును ఒక పదార్థముగా ఇచ్చినందున మీకు వందనములు. మేము భోజనము భుజించుట వల్ల మీకు కీర్తి రావలయునని కోరుచున్నాము. ఆమేన్.

2. పోషకుడవైన తండ్రీ! మేము ఆహారమును సంపాదించే శరీరము మీరు మాకు దయచేస్తే, మీరు ఏర్పరచిన ఆహార పదార్థములు సంపాదించగలము. అవి మాకు సమృద్ధిగా దొరికేటట్లు మీ దీవెన దయచేయుము. ఆమేన్.

3. పోషకుడవైన తండ్రీ! ఈ ఆహారము వల్ల రెండు మేళ్ళు దయ చేయుము. మొదటిది అనారోగ్య నివారణ, రెండవది ఆరోగ్యార్థమైన బలము, పుష్టి, జ్ఞానము, ఆయుష్షు: ఇవి దయచేయుమని వేడుకొనుచున్నాము తండ్రి! ఆమేన్.

4. పోషకుడవైన తండ్రీ! ఈ శరీరాహారము భుజించునప్పుడు మా ఆత్మకు మీరు ఇచ్చుచున్న ఆత్మాహారము మాకు జ్ఞాపకము చేయుము. అప్పుడు మాకు రెండు సంతోషములు కలుగునుగాక! ఆమేన్.

5. పోషకుడవైన తండ్రీ! విచారము, భయము, దిగులు, అనుమానము, అసహ్యము కలిగించు విషయములను భోజన సమయమునందు మా మనస్సులోనికి రానీయకుము గాని సంతోషము కలిగించే సంగతులు మాత్రమే రానిమ్ము. ఆమేన్.

6. పోషకుడవైన తండ్రీ! లోకములో అనేకమంది బీదలున్నారు. వారికి ఆకలి తీర అన్నము దొరకదు, వారిని కనిపెట్టుము. అన్నదాన సమాజములను వర్ధిల్లచేయుము. ఆమేన్.

7. “నాకేమి కొదువ నాథుడుండ” అనే కీర్తన భోజన సమయమునందు పాడుకొనవలయును. “పగవారల్ సిగ్గు” అనే చరణము కూడ పాడుకొను కృప మాకు దయచేయుము. ఆమేన్.

# రాత్రికాల ప్రార్థన

1. ఓ దేవా! ఆరుదినములు పనిచేసి ఏడవ దినమున విశ్రమించిన సృష్టికర్తవైన మా దేవా! మీకు స్తోత్రములు. మాకుకూడ ఈ లోకములో విశ్రాంతి ఏర్పరచినావు పగలు అంతయు పనిమీదనున్న మాకు విశ్రాంతి కలుగునట్లు రాత్రి సమయము ఇచ్చినారు. ఇప్పుడు పరుండబోవుచున్నాము, మాకు సుఖనిద్ర కలిగించుము. ఆమేన్.

2. లోకములో మా జీవితకాలమంతా పనిచేసిన తరువాత పరలోకమందు మాకు నిత్య విశ్రాంతి నియమించినారు. అది తలంచుకొని అది కడవరి తలంపుగా తలంచుకొని పరుండబోవుచున్నాము. ఆలకించుము మరియు దీవించుము! ఆమేన్.

3. నా ప్రియుడవైన తండ్రీ! నా శరీరము, నా ఆత్మ, నాకు కలిగిన సమస్తము మీకు అప్పగించి నేను నిద్రపోవుటకు వెళ్ళిపోవుచున్నాను, అంతయు మీరే చూచుకొనుము ఆమేన్.

4. సర్వజన జనకుడా! నేను, మా ఇంటివారు నిద్రమీద ఉన్నప్పుడు మీ పరిశుద్ధ దూతలను మా చుట్టు కావలిగా ఉంచుము. ఆమేన్.

5. ఓ తండ్రీ! నా తండ్రీ! నన్ను ప్రేమించే తండ్రీ! నేను మీకు ముద్దాయిగా ఉంటాను గనుక ఉదయమున నేను లేవకముందు మీరు వచ్చి నన్ను పరలోకమునకు తీసుకొని వెళ్ళిన కూడా అది మీ ప్రేమయే గనుక వందనములు ఆమేన్.

6. కాపాడే తండ్రీ! విమోచకుడవైన తండ్రీ! చీమలు, దోమలు, ఈగలు, జెర్రిలు, తేళ్ళు, పాములు, జంతువులు, దొంగలు, మాకు హాని కలిగించే దయ్యములు, మాయొద్దకు రాకుండ కాపాడుము. ఆమేన్.

7. మేము మా కన్నులు మూసికొనియుండగా మీ కన్నులు తెరచి మమ్మును చూస్తూయుండే తండ్రీ! మీకు స్తోత్రములు. ఆమేన్. మంచి ఆలోచనలు, మంచి కలలు, మీ చిత్తమైతే మంచి దర్శనములు మాకు సంభవించేటట్లు కృప దయచేయుము. ఉదయమున శ్రమతీరి సుఖముగా లేచునట్లు కృప దయ చేయుము. ఆమేన్.

# పిల్లలకు నేర్పవలసిన ప్రార్థనలు

1. యేసుప్రభువా! మీరు ఎల్లప్పుడు నాకు జ్ఞాపకము రావలెనని కోరుకొనుచున్నాను.

2. యేసుప్రభువా! నేను ఏ తప్పు చేయకుండా భక్తిగా నడిచేందుకు బలము దయచేయుము.

3. యేసుప్రభువా! ఈ నిమిషము వరకు ఇన్ని సంవత్సరములు నన్ను కాపాడినందుకు వందనములు.

4. యేసుప్రభువా! నాకు చదువు చెప్పించుచున్నావు గనుక వందనములు.

5. యేసుప్రభువా! నాకు కీర్తనలు నేర్పుచున్నారు గనుక వందనములు.

6. యేసుప్రభువా! నాకు ప్రార్థనలు నేర్పుచున్నావు గనుక వందనములు.

7. యేసుప్రభువా! ఇప్పటివరకు ఆరోగ్యమును, చదువును, బలమును ఇచ్చి బాగుగా ఆహారము భుజించునట్లు కాపాడినారు గనుక వందనములు.

8. యేసుప్రభువా! మీరే నా దేవుడవు, రక్షకుడవు, తండ్రివి, నన్ను కాపాడువారు, నా సమస్తము అయి ఉన్నారు గనుక మీకు అనేక వందనములు.

9. యేసుప్రభువా! నాకు కావలసినవి ఇస్తారు గనుక వందనములు.

10. యేసుప్రభువా! చివరకు నన్ను మోక్షములోనికి చేర్చుకొందురు గనుక వందనములు.

11. యేసుప్రభువా! రాత్రులు, పగలు నాకు తోడైయుండుము.

12. యేసుప్రభువా! చదువులో, భోజన సమయములో, ఆడుకొనునప్పుడు మాకు తోడైయుండుము.

13. యేసుప్రభువా! నాకు ఏ కష్టము రాకుండా కాపాడుము.

14. యేసుప్రభువా! నాకు మంచి బుద్ధి, మంచి జ్ఞానము అనుగ్రహించుము.

15. యేసుప్రభువా! నన్నే కాదు, తల్లిదండ్రులను, అక్కలను, అన్నలను, తమ్ములను, చెల్లెండ్రను దీవించుము.

16. యేసుప్రభువా! మా చుట్టాలు ఎక్కడ ఉన్నారో వారినందరిని దీవించుము.

17. యేసుప్రభువా! మాకు సహాయము చేయువారందరిని దీవించుము.

18. యేసుప్రభువా! మా చుట్టూనున్న వారిని మా యింటిలో ఉన్నవారిని దీవించుము.

19. యేసుప్రభువా! జంతువులను, పక్షులను కూడా దీవించుము.

20. యేసుప్రభువా! చిన్నపిల్లలను, అన్యులను, క్రైస్తవులను, అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చు వారిని దీవించుము.

21. యేసుప్రభువా! ఇక్కడ ప్రార్థనకు వచ్చు వారిని దీవించుము.

22. యేసుప్రభువా! మా దేశమంతటిని దీవించుము.

23. యేసుప్రభువా! మా మతమే మా దేశమంతా వ్యాపింపజేయుము.

24. యేసుప్రభువా! నేను ఈ ప్రార్థన జ్ఞాపకము ఉంచుకొని ప్రార్థించుకొనునట్లు దీవించుము.

25. యేసుప్రభువా! మిమ్మును, మీ మతమును అందరు తెలిసికొనునట్లు దీవించుము.

26. యేసుప్రభువా! నేను మంచి అబ్బాయిని/ అమ్మాయిని అగునట్లు దీవించుము.

27. యేసుప్రభువా! ఈ ప్రార్థన తరచుగా చేసికొనునట్లు దీవించుము ఆమేన్.

## వేదపఠనము చేయక పూర్వము చేయవలసిన ప్రార్థనలు

1. వాక్యమును వ్రాయించిన తండ్రీ! నేనిప్పుడది చదువబోవుచున్నాను, దీనిలోనుండి నాతో మాటలాడుము, మీ మాట నాకు వినబడునట్లు చేయుము. ఆమేన్.

2. పరిశుద్ధుడవైన దేవా! మీ పరిశుద్ధ గ్రంథములో వ్రాయించిన వ్రాతలు నా హృదయములో కూడ వ్రాయించుము. ఆమేన్.

3. మంచి ఊహలు కలిగించే తండ్రీ! మీ పరిశుద్ధ గ్రంథము చదువుకొనునప్పుడు లేనిపోని ఊహలు రానియ్యక మీరు ఉద్దేశించిన ఊహలు మాత్రమే రానిమ్ము. ఆమేన్.

4. మాకు కనబడవలెనని కోరే తండ్రీ! మీ వాక్యములో ఉన్నట్లు మీరు మాకు కనబడుము. మీ హృదయమును మా హృదయమునకు కనబరచుము. ఆమేన్.

5. జ్ఞాన స్వరూపివైన తండ్రీ! మీ పత్రములోనున్న విషయములు నేను చదివిన తరువాత వాటిని మరువకుండా నా హృదయమందు భద్రము చేసికొనే శక్తిని వృద్ధి పొందించుము. ఆమేన్.

6. నిత్యుడవైన తండ్రీ! భూమ్యాకాశములు గతించినను మీ వాక్యము మాత్రము గతింపదు. అట్టి మీ వాక్యము అంతయు నాయొక్క (లేదా) మాయొక్క జీవితములో సర్దుకొనునట్లు (ఆవరించునట్లు) మీ పరిశుద్ధాత్మ యొక్క వెలిగింపు కలిగింపుము. మీ వాక్యగ్రంథము మీ భక్తులకు ఉత్తమ లేఖనముగా వినిపించి వ్రాయించిన మీ పరిశుద్ధాత్మ నాలో కూడా అట్టి పని చేయునట్లు, విద్యార్థులు వ్రాత పుస్తకములో సిద్ధపరచు రీతిగా, మా అంగీకార స్వభావమును కూడ సిద్ధపరచుము. ఆమేన్.

7. పోషకుడవైన తండ్రీ! మీ వాక్యమును మానవ బోధకులు కలహ కారణమగు భేదాభేదములైన బోధనలుగా ఉపదేశించుచున్నారు. కాబట్టి సరియైన అర్థము మాకు తెల్పుము. ఆమేన్.

## బైబిలు మిషను అభిమానులు చేయదగిన ప్రార్థనలు

1. తండ్రీ! బైబిలు మిషనును మీరే బయలుపరచియున్నారను సంగతి లోకమంతటికి మీరే స్వయముగా కనబడి చెప్పుము, అనేకులు నమ్మరు, అయినను చెప్పుమని వేడుకొనుచున్నాము.

2. దేవా! బైబిలు మిషనును మీరు స్థాపించినారను సంగతి మేము కూడా ప్రకటింతుము. మా ప్రకటనలు దీవించుము. మాలో మెంబర్లుగా నుండియు, మా అభిప్రాయములకు దూరస్థులైయున్న వారి అపరాధములను వారికి స్వప్నములో తెలియపర్చి దిద్దుకొనుటకు వారికి శక్తి దయచేయుము.

3. దేవా! మా విరోధుల యొక్క మనస్సులను, అనగా మాలోనుండి విడిపోయినవారి మనస్సులను, మాలోనే ఉండి మాకు

విరోధముగా నున్నవారి మనస్సులను, ఇతర మిషనులలోనున్న మా విరోధుల మనస్సులను మార్చివేయుము.

4. దేవా! మేము తప్పు సిద్ధాంతములను చెప్పకుండ ఆపుచేయుము.

5. దేవా! మేము వేసే పత్రికలు, పుస్తకములు మిషనుద్వారా వ్యాపింపచేయుము.

6. దేవా! మా మీటింగుల ద్వారా, స్వస్థత కూటముల ద్వారా పద్యముల ద్వారా, ఆరాధన క్రమము ద్వారా మీ విషయములు అందరికి తెలుపుము.

7.దేవా! బైబిలు మిషను ద్వారా ఆలోచించుచున్న మీ ఆలోచనలన్నియు నెరవేర్చుము.

8. దేవా! మీకు ఇష్టమైన వారిని మాత్రమే మీ బైబిలు మిషనులోనికి తీసికొని రమ్ము.

9. దేవా! అయోగ్యులమైన మమ్మును బైబిలు మిషనులోనికి పిలిచినందుకు మీకు ప్రత్యేకమైన వందనములు.

10. దేవా! ఏ ప్రత్యేకమైన ఉద్దేశ్యముతో మీరు బైబిలు మిషనును బయలుపరచినారో దానిని త్వరలో నెరవేర్చుము.

11. దేవా! మా బోధలకంటె, మా ప్రవర్తన వెల్లడిలోనికి వచ్చునట్లు తోడ్పడుము.

12. దేవా! ప్రస్తుతము మా మిషనులోనున్న అక్రమములన్నిటిని పరిహరించుము.

13. దేవా! మా అందరి బలహీనతలను తొలగించుము.

14. దేవా! మాకు పాఠశాలలు, వైద్యశాలలు, అనాధశాలలు, చేతి పనులశాలలు, ముద్రాక్షరశాలలు, పుస్తకశాలలు, గొప్ప దేవాలయములు, గొప్ప గ్రంథములు, గొప్ప రాబడులు, జీత

నాతములు, పొలములు, సమాధి దొడ్లు, క్రైస్తవ విదేశీ సహాయములు, మిషను స్థానములు మాకు లేవని ఇతర మిషనుల వారు హేళన చేయుచున్నారు. గనుక మీరు వారి తట్టు చూడుమని వేడుకొనుచున్నాము.

15. దేవా! మా సిద్ధాంతములు విని, అనేకులు నవ్వుచున్నారు, వారివైపు కూడ చూడుము.

16. దేవా! మా మిషనులలోని పిల్లలను విద్యార్థులనుగాను, ఉద్యోగస్తులను గాను చేయుము. పురుషులను, స్త్రీలను, బీదలను, పాపులను, చిక్కులలో ఉన్నవారిని ఇట్టి వారినందరిని ఆదరించుము.

17. దేవా! మా మిషనులో ఉన్నవారందరికి దర్శనవరము దయచేయుము.

18. దేవా! మేము దేవునిమీద ఆధారపడియున్నామని చెప్పుచు మనుష్యుల మీదను, ఔషధములమీదను, చందాల మీదను, ఆధారపడుచున్నామని ఇతరులు మమ్మును హాస్యము చేయుచున్నారు. దీనికి మేము చోటియ్యకుండునట్లు కృప దయచేయుము. మేము వారికి ఒక జవాబు ఇస్తున్నాము. ఏలియా కాకులమీద ఆధారపడలేదు, మోషేతల్లి ఫరో కుమార్తె మీద ఆధారపడలేదు. ఈ ఏర్పాటు చేసిన మీ మీద ఆధారపడినామని జవాబు చెప్పుచున్నాము.

19. దేవా! బైబిలు మిషను మీరే బయలుపరచినారనేది ఒక్కటి మాత్రమే గొప్ప విషయమనియు, తక్కిన మా విషయములలో ఇతర మిషనులలోనున్న బలహీనతలు మాకు కూడ ఉన్నవనియు మేము చెప్పుచున్నాము. ఈ మాట దీవించుము.

20. దేవా! ఓహో! ఇది కేవలము దేవుడు బైలుపరచిన మిషను అని నమ్మగల వారు అనుచు సంతోషింతురు. అలాగే మమ్మును చూచి కూడ ఓహో! వీరు దేవుని బైబిలు మిషనులో చేర్చుకొనబడిన వారు అని

పలుకుచు సంతోషించునట్లు ఇతర మిషను విశ్వాసులను, అభిమానులను ప్రేరేపింపుమని వేడుకొనుచున్నాము.

21. దేవా! మాలో ఏవైన బహిరంగమగు తప్పులు గాని, రహస్యమైన తప్పులుగాని ఉన్నయెడల మమ్మును పిశాచికి గాని, శత్రువులకుగాని, సజ్జనులకుగాని, అధికారులకుగాని, అప్పగింపక మీరే మమ్మును క్షమింపుము. దావీదు ఇట్లే కోరుకొనగా అతని కోరిక ప్రకారము చేసినారు కదా!

22. దేవా! తండ్రీ! ఈ మా ప్రార్థనలలో ఇంకా ఏమైన చేర్చవలసినవి ఉన్న యెడల మీరే చేర్చుము, తీసివేయవలసినవి ఉన్నయెడల మీరే స్వయముగా తీసివేయుము.

23. దేవా! నరుల జ్ఞాపకశక్తిలో నుండి మా పొరపాటులను సమూలముగా పెరికివేయుము.

24. దేవా! మమ్మును రాకడకు సిద్ధపరచుము.

25. దేవా! రహస్య సన్యాసులను రాకడకు ముందే పంపించుము. మొదటి రాకడలో చేసినట్లు మృతులను లేపుము. పక్షులతోను, మృగములతోను సువార్త చెప్పించుము-. ఒక దినము లోకములో ఉన్న వారందరికి ఏకకాల స్వప్నములో మీరు కనబడి మాట్లాడుము.

ఈ ప్రార్థనలను మీ జనితైక కుమారుని ముఖము చూచి ఆలకింపుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

# కుటుంబ ప్రార్థన

ఓ దేవా! కుటుంబములలో చాలామందికి బిడ్డలను ఇచ్చినారు. సంతోషమే, కాని వారికి మంచి లక్షణములు ఇమ్మని వేడుకొనుచున్నాము. వారిని భక్తి మార్గములో పెంచుటకు తల్లిదండ్రులకు శక్తికూడా ఇమ్మని వేడుకొనుచున్నాము. పిల్లలు సరియైన స్థితిలో లేనప్పుడు వారిని ఎట్లు

మళ్ళింపవలెనో నేర్పుము. బాగా ఉన్నప్పుడు నడిపించుట సులువే. అప్పుడు తల్లిదండ్రులకు అంత పని ఉండదు. పిల్లలు తప్పుదారి నడిచేటప్పుడు వారిని మళ్ళించే గొప్ప పని ఉండును. తల్లిదండ్రుల భక్తి, జ్ఞానము, మనస్సాక్షి, శరీరబలము, సమయము వాడుకొనుటకు అదే మంచి సమయము. కాబట్టి అందరికి అట్టి తరుణము దయచేయుము. అబ్రాహాము ఎవ్వరిమీద కోపపడినట్లు లేదు, అతనితో ఉన్నవారు సరిగా ఉన్నారు, గనుక కోపపడవలసిన అవసరము లేదు, దిద్దవలసిన అవసరము లేదు. నేటికాలపు పిల్లలు క్రమము తప్పినారు. తల్లిదండ్రులు వారిని మళ్ళించుటకు ఎక్కువ కష్టపడవలెను. అది వారికి దయచేయుము. పిల్లలు "చెప్పిన మాట వినరు" అని మీవాక్యములో (2తిమోతి 3:2) పౌలుచేత వ్రాయించినారు గదా! అది ఇప్పుడు నెరవేరుచున్నది గనుక బాగుచేయుట కూడ నెరవేరవలెను. పిల్లల విషయములో పూచి తల్లిదండ్రులే గనుక తమ విధి తామే నెరవేర్చుకొనవలెను. శక్తిగల ప్రభువా! ఓ ఎల్ షద్దాయ్! వారికి శక్తి దయచేయుము. నడుపుటకు, నడుచుటకు ఈ రెండు శక్తులు దయచేయుము. ఆమేన్.

ఒక ఇంటిలోనికి వ్యతిరేకమైన శక్తి వచ్చునప్పుడు దానిని ఎదిరించుటకు పరలోకము నుండి, ఎల్ షద్దాయ్ నుండి శక్తి రాకమానదు.

1. దయగల తండ్రీ! కుటుంబములో పిల్లలు ఒక శాఖకు సంబంధించి ఉన్నారు. ఆ శాఖ పేరు సర్వస్వతంత్ర శాఖ. అందుచేత తల్లిదండ్రులు చెప్పిన మాట వినక, తమకు తోచిన ప్రకారము చేస్తారు. అందుచేత తల్లిదండ్రులకు బాధ. ఇది అనేక పర్యాయములు జరుగుచున్నది. ఈ కుటుంబములలో అట్టిది జరగకుండా చేయుమని మా ప్రార్థన.

2. మరియొక శాఖ:- కొందరు పిల్లలు ఏదైన అడిగితే నిజము చెప్పక అబద్ధము నిజము వలె ఎంతో నిజముగా ఉన్నట్లు దృఢముగా చెప్పుదురు కావున ఇది పరిహరింపుము.

3. ఇంటిపట్టున ఉండక తమకు ఇష్టమైన చోట్లకు వెళ్ళుదురు. ఇదికూడ పరిహరింపుము.

4. “బడికి వెళ్ళవలసినది” అని చెప్పి పంపించగా, ఎక్కడికో వెళ్ళి “ఇప్పుడే బడి అయిపోయినది” అని చెప్పుదురు. ఈ దుర్గుణమును పరిహరింపుము.

5. బడిలో పాఠములు సరిగా నేర్చుకొనక ఫెయిల్ అయితే మిమ్మును దూషింతురు. ఇది కూడ పరిహరింపుము.

6. ఇంటిలో ఏదైన ఎత్తుకొనిపోయి అమ్ముకొందురు. స్నేహితులకు పంచిపెట్టుదురు. పొరుగూరు వెళ్ళుదురు. ఎందుకు ఈలాగు చేసితిరని అడిగితే మాకు “వెళ్ళుమని” స్వరము వినబడినది. అందుచేత వెళ్ళినాము అని అందురు. వినబడటం నిజమే కాని, అది దురాత్మ చెప్పెనని వారికి తెలియదు. అది వారికి తెలియజెప్పుము.

7. వారిని తల్లిదండ్రులు శిక్షించితే మరింత మొద్దుబారుదురు. ఈ మొండితనము పరిహరించుము.

8. ప్రార్థనలో ఉండవలెను. బైబిలు చదువవలెను, కీర్తనలు పాడవలయునని చెప్పితే “నీవు చెప్పినట్లు చేయు బుద్ధి మాకు కలుగుట లేదు” అని అందురు. ఈ దుర్గుణమును గూడ పరిహరింపుము.

9. మీలో దుర్మార్గత ఉన్నది అని చెప్పితే, ఏ మాత్రము నమ్మరు. ఓ ప్రభువా! ఈకాలమందు సాతాను కొందరికి మతి చాంచల్యము కలిగించుచున్నాడు. కొందరిని ఎక్కడికో తీసికొని వెళ్లి అక్కడ పరుండ బెట్టుచున్నాడు. వారికి తెలియదు మరియు పిశాచి భిక్షకుని వలె కనబడి, కొంతమందికి మాయ మాటలు చెప్పిన క్రైస్తవులు యేసుప్రభువే అని భ్రమపడుదురు. పరీక్షింపకుండా భిక్షము వేయకూడదు. మరియు అనవసరముగా అతడు భయము పుట్టించును. జాగ్రత్తగా ఉండవలెను.

# అందరు చేసికొనవలసిన ప్రార్థన

యేసుక్రీస్తు ప్రభువా! నా నిమిత్తమై మీరు చేయు సమస్త ఉపకారముల కొరకై మీకనేకమైన వందనములు. నా పాపములు పరిహరించుము. పాపములో పడకుండ కాపాడుము. నా వ్యాధులు పోగొట్టుము నా కష్టస్థితులలోను, పనులలోను, నాకు తోడై యుండుము. నన్ను మాత్రమే కాక సర్వజనులను కూడ మీ ప్రకటన, బోధ మూలముగా మీతట్టు త్రిప్పి రక్షించుము. నా జీవితయాత్ర చాలించిన మీదట, నన్ను మోక్షరాజ్యములోనికి చేర్చుకొనుము. ఆమేన్.

# వ్యక్తిగత ప్రార్థన

ఓ దేవా, మీరు నన్ను మీ సంఘములో చేర్చినందుకు అనేక వందనములు, ఓ దేవా, ఈ నిమిషమువరకు మీరు నాకు చేసిన మేళ్ళ విషయమై మీకు వందనములు. తండ్రీ నాకు కలిగిన ఆపదలనుండి, కీడులనుండి తప్పించినందుకు స్తోత్రము. తండ్రీ నా పాపములన్నియు క్షమించుము, పాపములు జయించుటకు శక్తి దయచేయుము. ఓ తండ్రీ నాకు తెలిసిన ఏ పాపము చేయకుండ నడుచుకొందును. మీరు ఏది చెప్పిన అది చేయుదును. నా శరీరము, నా ఆత్మ, నా ప్రాణము మీకు సమర్పణ చేయుచున్నాను. నాకు కలిగినది అంతయు మీకు అప్పగించుచున్నాను. మీ చిత్తప్రకారము నన్ను నడిపించుము, నన్ను మీ పనిలో వాడుకొనుము. మీ వాక్యము నాకు బాగుగా బోధించుము. నేను మీ వాక్యము నేర్చుకొని ఆప్రకారము చేయుదును. మీరే నాపోషకుడవు, మీరే నా రక్షకుడవు, మీరే నా దేవుడవు, మీరే నా తండ్రివి, మీరే నా రాజువు, మీరే నా సమస్తమైయున్నారు, మీరే నన్ను నడిపించువారు, మీరే నన్ను కాపాడువారు, మీరే నా బోధకుడవు, మీరే నా స్నేహితుడవు, మీరే నన్ను మోక్షమునకు తీసికొని వెళ్లువారు. కాబట్టి నేను మీకు పూర్తిగ

సమర్పించుకొనుచున్నాను. నేను మీ పనివాడను, నేను మీ బిడ్డను, నన్ను అంగీకరించుము. నా పాదములతో మీ నీతిమార్గమున నడచెదను, నా కండ్లతో మిమ్ములనే మీ వైపే చూచెదను, నా చెవులతో మీ మాటలు విందును, నా నోటితో మీ మాటలే పలుకుదును, నా హృదయములో ఎల్లపుడు మిమ్మును కలిగియుందును, నా జ్ఞాపకశక్తితో ఎప్పుడుబడితే అప్పుడే, ఎక్కడబడితే అక్కడే మిమ్మునే జ్ఞాపకము చేసికొందును, మిమ్మునే స్తుతింతును, మిమ్మునే ప్రార్థింతును, మిమ్మునే నమస్కరింతును, మీ కీర్తనలే పాడుకొందును, మీ వాక్యమే చదువుకొందును, మిమ్మును గురించి అందరికి చెప్పెదను, పది ఆజ్ఞల ప్రకారముగ చేయుటకు నా శాయశక్తుల ప్రయత్నించెదను. విశ్వాసులకు సహాయముగ ఉందును. లోకములో ఏ వస్తువు చూచిన మిమ్ములనే ధ్యానించెదను. ఏలాగుననగా (1) చెట్టును చూచినప్పుడు మాతండ్రి ఎంత చక్కని పండ్లను, ఆకులను కలుగజేసినారు స్తోత్రము అని అందును. (2) జీవరాసులను చూచి ఆహా మా తండ్రి వీటికి జీతనాతములు లేకపోయినను పోషించుచున్నారు. నన్ను ఎందుకు పోషించరు అందును. (3) సూర్యచంద్ర నక్షత్రములను చూచినప్పుడు ఆహా ఇవే ఇంత కాంతిగా ఉన్నవే మా తండ్రి ఇంకా ఎంత కాంతిగా ఉండునో అనుకొందుము. నన్నెంత మహిమగా చేయునో అని తలంచుకొని మురియుచుందును, (4) వర్షమును చూచినప్పుడు మా తండ్రి దాహశాంతి నిమిత్తమై, శుద్ధినిమిత్తమై ఎంత మంచినీరు దయచేసినారు స్తోత్రము అని అందును. (5) గాలివేసేటప్పుడు మా తండ్రి నా సదుపాయము ఎరిగినవారు, ఎంత చక్కని గాలి వచ్చుచున్నది స్తోత్రము అని అందును. (6) ఉరుములు, మెరుపులు, పిడుగులు ఫెళ్ళు ఫెళ్ళుమని అన్నప్పుడు మనుష్యులు హడలి పోయేటప్పుడు మా తండ్రి పాపాత్ముల యెడల జాలిగలవారు అయినప్పటికిని పాపము యెడల మహా భయంకరుడు అని జ్ఞాపకము తెచ్చుకొని మిమ్ములను మహా వినయముతో భయముతో పూజింతును. (7) ఆకాశమును చూచినప్పుడు ఆకాశము ఇంత పెద్దది.

అంతములేనిది. మా తండ్రి ఎంత గొప్పవారు అని ఆనందించెదను. (8) సృష్టిని చూచునప్పుడెల్ల సృష్టికర్తవగు మిమ్ములనే జ్ఞాపకమునకు తెచ్చుకొందును. ఎన్ని శోధనలు వచ్చిన, కష్టములు వచ్చిన, నష్టములు వచ్చిన, ఆపదలు వచ్చిన, నిందలువచ్చిన మిమ్ములను విడిచిపెట్టను.

ఓ తండ్రీ మీ వాక్యము చదువునప్పుడెల్ల మీరు నాతో మాట్లాడుచున్నారను విశ్వాసమును దయచేయుము, మీ వాక్యమును అన్ని భాషలలో ప్రచురించు బైబిలు సొసైటీవారిని, వారి పనిని బాగుగ సాగునట్లు కృప దయచేయుము. ప్రతిదినము నా కష్టములు మీ దగ్గర చెప్పుకొని మీ వలన ఆదరణ పొందుటకు ప్రార్థించు మనస్సు దయజేయుము. నేను నేర్చుకొన్న సంగతులు ఇతరులకు చెప్పు వాక్కు నాకు దయచేయుము. నేను పరిశుద్ధ ప్రవర్తనగలిగి ఇతరులకు మంచి మాదిరిగ నడుచు కృపాబలము దయచేయుము. మరియు మీ రాజ్య సంబంధమైన పనులకు ఉపయోగపరచు ధనమును చందావేయు ధారాళత కూడ దయచేయుము. మీరు ఈ లోకమునకు త్వరగా వచ్చుచున్నారని వినుచున్నాము. అందుకు నన్ను సిద్ధపరచుమని వేడుకొనుచున్నాను. ప్రభువా మీరు నాకు తోడైయున్నారు గనుక మీకు స్తోత్రములు. ఈ మా ప్రార్థన స్తుతులను యేసు నామమున అంగీకరించుమని వేడుకొనుచున్నాము తండ్రీ! ఆమెన్.

## కాపుదల ప్రార్థన

ఓ తండ్రీ! నిరాకారుడవైన తండ్రీ! మీరు నిరాకారులు గనుక మాకు కనబడక పోయినను మాకు సహాయము చేయుచున్న తండ్రీ, కనబడకపోయినను తోడైయున్న తండ్రీ! మీకు వందనములు. మా కూటస్థులకు నెమ్మది, చల్లదనము దయచేయుము. ఎవరికి శరీరము వేడిగానున్నదో, వారికి చల్లదనము దయచేయుము. సుఖము, నెమ్మది, దీవెన, చల్లదనము దయచేయుము. నెమ్మది మీవలననే వచ్చును. మందముగా ఉన్న మాలో వేడి దయచేయువారు మీరే. వేడి కావలసిన

స్థితిలో వేడి, చలువ కావలసిన స్థితిలో చలువ దయచేయువారు మీరే. ముగ్గురు బాలురు అగ్ని హోత్రములో ఉన్నారు. వారికి వేడి కలుగలేదు. వారు మాడలేదు, వారి బట్టలు కాలలేదు. వారికి అగ్నిలో ఉన్నట్లు లేదు. ఎందుకంటే మీరు వారితో ఉన్నారు. ఒకప్పుడు మీరు, మీ శిష్యులు నీళ్లమధ్యనే ఉన్నారు. చలివారికి హానిచేయలేదు. అగ్ని వారికి ఏహాని చేయలేదు, జలము, చలి హాని చేయలేదు. ఇంకొకప్పుడు కొందరు గాలిలో ఉన్నారు గాని హాని చేయలేదు. ఎందుకంటే మీరు వారితో అక్కడ ఉంటారు. గనుక ఎక్కడ ఉన్నను హానిలేదు. కాబట్టి మీకు స్తోత్రములు మరల మాకు వర్తమానము దయచేయుము. ఇక్కడ ఉన్నవారినే కాక లేనివారిని కూడ దీవించుము. ఎక్కడ నుండి వచ్చిన వారినైనను దీవించుము. సూర్యునియొక్క కిరణములు పడునట్లు, కష్టకాల సముదాయముల వలన, ఇతర కారణముల వలన సహించలేని వారి యొక్క హృదయముల మీద, వర్షముయొక్క ధారలు కురిపించుము. అప్పుడు చల్లదనము కలుగును. మీ కృపాదారముల వలన, మీ కృపావరము వలన, చలువ కలిగెను. కాబట్టి మీకు స్తోత్రము. “పగలు ఎండదెబ్బయైనను, రాత్రి వెన్నెల దెబ్బయైనను మీరు తగలనీయరు” అని మీ పుస్తకములో వ్రాసినట్లు అవి మాకు తగలనీయరు. కొంతమందికి సూర్యబింబము వలన కలిగే వేడికాక ఆత్మప్రేరేపణ వలన వేడి కలుగును. అది సహించే కృప దయచేయుము. చల్లదనము దయచేయుము. మండు వేసవిలో వేడి హానికరమైనది. అయితే ఆత్మవల్ల వచ్చే వేడి హానిచేయదు. అది గొప్ప ఉపకారము చేయును. ఇప్పుడున్న వర్తమానము, మాకు కిరణములవలె, వానధారలవలె, చలువ గాలివలె అనుగ్రహించుము. మా అందరి యొక్క హృదయములు వ్రాత పుస్తకములుగా నిండునట్లు మీ వర్తమానముతో నింపుము. మీ ఆశీర్వాదము, మీ దివ్యబోధ విన్నవారిమీద కుమ్మరించుమని త్వరగా వచ్చుచున్న యేసు ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

# అన్ని అక్కరలు తీర్చే ప్రార్థన

1. ఓ తండ్రీ! కొన్ని కుటుంబములలో భార్యలు ప్రార్థనకు వస్తే భర్తలు ఒప్పుకొనరు. కొందరు "నా బదులు నీవు వెళ్ళు, నా బదులు ప్రార్థన చెయ్యి" అంటారు. ఇంకొందరు 'వెళ్లు నీ మతం నీదే అంటారు. మరికొందరు ఇంటి పనులు ఆటంకము లేకుండా చూచుకొనుము అంటారు, కొన్నిసార్లు భర్త పొలము పోయిన తరువాత భార్య ప్రార్థనలో ఉంటుంది. లేదా కేటాకిస్ట్ను పిలిచి ప్రార్థన చేయించుకుంటుంది. ఓ ప్రభువా! నా పిల్లలు పరీక్ష పాస్ అయి సీట్ వచ్చినది గాని ఉద్యోగము ఎన్ని తంటాలుపడిన దొరకడము లేదు. గాన మీరే సంబంధము కలిగించుకొని ఉద్యోగము రప్పించుము. ఓ ప్రభువా! మా బిడ్డలు పరీక్షకు వెళ్ళుచున్నందున పాసయ్యే మార్కులు తెచ్చుకొనే సామర్థ్యము దయచేయుము. మా బిడ్డలకు అశ్రద్ధ, మందస్థితి, మతిమరుపు రానీయకుము.

ఓ తండ్రీ! మా పిల్లవాడు ఆటల ధ్యాసలో పడి బడికి వెళ్ళడు. వెళ్లినట్లు చెప్పుతాడు, చెప్పినమాట వినడు గనుక మారుమనస్సు దయచేయుము.

2. మా తండ్రీ! మా బిడ్డకు యుక్తవయస్సు వచ్చినది, మనువు రావడము లేదు. పెండ్లి ఏర్పాటు మీదే గదా! త్వరలో తగిన సంబంధము కలిగించుము. ఓ తండ్రీ! నా తెలివి తక్కువతనం వల్ల నేను అప్పుల పాలైపోయినాను వాటిని తీర్చువారు మీరే నన్ను క్షమించుము. మరియు అక్కరలు నాకు శోధనలుగా వస్తే పిల్లలు ఉద్యోగానికి వచ్చినప్పుడు తీర్చేదను కాని ఇప్పుడు అప్పుచేసినాను తీర్చలేక పోవుచున్నాను కనికరించుము. దేవా! నా బిడ్డలకు చదువుమీద చాలా ఇష్టము, పుస్తకములకు, ఫీజులకు డబ్బు కట్టలేక పోవుచున్నాను. పిల్లలు వృధాగా ఉన్నారు. మార్గము సరాళము చేయుము. ఏ చిన్న సంగతియైనను తండ్రివైన మీకు చెప్పుకొనవలెను గదా! కటాక్షించుము మరియు అంగీకరించుము

3. ఓ తండ్రీ! మా ఇంటిలో ఒకరికి దీర్ఘ వ్యాధి ఉన్నది. ఎన్నో మందులు వేసినాము. ఎంతో మందిచేత ప్రార్థన చేయించినాము. అయినను ఫలితములేదు. మీరు ఘనవైద్యుడవు గదా! గనుక మీరు తలిస్తే, వారు మంచముమీద నుంచి వెంటనే లేచి పొలము వెళ్లును గదా! నా మనవి ఆలకించుము.

4. ఒక ఊళ్ళో సువార్త పని బాగా జరిగినది అనేకులు ప్రభువుతట్టు తిరిగినారు గాని రాత్రి ఆరాధనకు స్థలము లేదు. వారూ, వీరూ విని సంతోషించినారు. గ్రామాధికారి వారికి ఆరాధనశాల కట్టిస్తాను అని వాగ్దానము ఇచ్చెను గనుక ఆయనను దీవించుము. ఆమేన్.

5. ఓ ప్రభువా! ఈ వేళ మీటింగు ముగిస్తున్నాము కాబట్టి మీ దూతలను సహాయముగా పంపి గమ్యస్థానము చేర్చెదరని, సహాయము చేయుదురని నమ్ముచున్నాము. వచ్చే నెల మేము చేయు మీటింగులకు సహాయము చేయుము. ఇప్పుడు జరిగినవి దీవించుము. ఆమేన్.

# III. స్వస్థత ప్రార్థనలు

## తైలము కొరకైన ప్రార్థన

పరమ వైద్యుడవైన ఓ దేవా! మీరు వ్రాయించిన బైబిలు వాక్యములు చదువుకొని, ఒలీవ నూనె నొసటి మీద సిలువ గుర్తు వేసుకొనిన యెడల అందరు తప్పకుండ బాగుపడుదురు. నాడు మీ శిష్యులైన వారు మీ నామమున రోగులను స్వస్థపరచినారు. అలాగే నేడు పాదుర్లు అయినవారు మీ నామమున రోగులను బాగుచేయుచున్నారు గనుక నాటి మీ శిష్యులు నేటి పాదుర్లతో సమానము. మీ ఆజ్ఞ చొప్పున ఏది చేసినా నెరవేరును. బాగుచేయువారము మేము గాదు, యేసుప్రభువే అని చెప్పిన యెడల, బాగుపడునప్పుడు విశ్వాసము లేనివారు, విశ్వాసులే అయినట్టు ఋజువగును.

ఓ ప్రభువా తైలము వాడుచున్న వారినందరినీ దీవించుము. అనగా రోగులను, తైలమును వాడే వారిని, ఈ తైలము ముట్టుకొనే వారిని, తైలమును దీవించుము. బాలురు, బాలికలు, యౌవనస్థులు, వృద్ధులు, విశ్వాసము లేనివారు, విశ్వాసము గలవారు ఈ తైలమును వ్రాసికొని విశ్వాసముతో ప్రార్థన చేసికొనిన అనేకులు బాగుపడుదురు.

ఓ తండ్రీ! ఇప్పుడు ఎవరు నూనె తెచ్చుకొన్నారో ఆ సాధనం ద్వారా నూనె పని పట్టిదే అని వారు అనుకొనకుండునట్లు స్పష్టపరచుము. ఇప్పుడు స్వస్థత ప్రార్థనలు విన్నవారిలో ఎవరు తైలమును తెచ్చుకొన్నారో వారి యొక్క తైలమును పగిలిపోకుండ బుడ్డిని ఆశీర్వదించుము. ఈ వైద్యము అన్ని వైద్యముల కంటే గొప్పది, ఎందుకంటే పరిశుద్ధాత్మ తండ్రీ! మీరు చెప్పినది, మీరు వ్రాయించినది మాకు ఏ వైద్యులు చెప్పలేదు మరియు ఏ వైద్య గ్రంథములోను లేదు. దీనిని క్రమముగా వాడుకొనే ఓపిక దయచేయుము.

దయగల ప్రభువా! వీరు దీవెన కొరకు తెచ్చుకొన్న ఈ తైలమును దీవించుము. ఈ తైలము ఎవరికి వాడుదురో వారికి స్వస్థత కలుగునట్లు మీ కృప దయచేయుము. ఓ ప్రభువా! మీ వాక్యములో ఉన్నట్టే మేము ఈ తైలము వాడుచున్నాము. కంటికి కనబడే వస్తువు ఉన్నయెడల మా విశ్వాసము వృద్ధి పొందును అని చెప్పి అంజూరపు పండ్లను, ఏటి నీళ్ళను వాడినారు, బురద కూడ వాడినారు గనుక వస్తువులో ఏమున్నది! మీ దీవెనలో ఉన్నది. ఇప్పుడు ఈ తైలమును దీవించుము, త్రిత్వదేవా! ఈ మా ప్రార్థనలు కాక లోకములోవున్న అన్ని ప్రార్థనలు అంగీకరించుము.

ఈ తైలమును పరమ ఔషదముగా మారుస్తూ రోగులను బాగుచేయుచున్న దయగల ప్రభువా! వీరు దీవెన కొరకు తెచ్చుకొన్న ఈ తైలమును దీవించుము. ఈ తైలము ఎవరికి వాడుదురో వారికి స్వస్థత కలుగునట్లు మీ కృప దయచేయుము. ఓ ప్రభువా! మీ వాక్యములో

ఉన్నట్టే మేము ఈ తైలము వాడుచున్నాము. కంటికి కనబడే వస్తువు ఉన్నయెడల మా విశ్వాసము వృద్ధి పొందును గనుక వస్తువులలో ఏమున్నది! మీ దీవెనలో ఉన్నది. ఇప్పుడు ఈ తైలమును ఔషదముగా మార్చి దీవించుము అని యేసు నామమందు అడుగుచున్నాము తండ్రీ! ఆమేన్.

## స్వస్థి ప్రార్ధన-1

దేవా! యేసుక్రీస్తు ప్రభువా! మీరు దేవుడవైనను మా మానవులకు కనబడుటకును, మోక్షలోక బోధలు వినిపించుటకును, వారితో కలసి మెలసి యుండుటకును నరుడుగా జన్మించినారు, గనుక మీకనేక నమస్కారములు. పక్షవాత రోగి పాపములు క్షమించి అతని జబ్బును బాగుచేసినట్టు నా పాపములు క్షమించుము, నా జబ్బులు బాగుచేయుము, ఇట్లు చేయుదురని నేను నమ్ముచున్నాను. మా కాలములోకూడ మీరు వేలకొలది ప్రజలను మీ ప్రభావమువల్ల బాగుచేయుచున్నారు, మీకనేక స్తుతులు. నా శరీరములోని జబ్బులు, బాధలు నాకంటే మీకే బాగుగ తెలుసును గనుక పాపులను, రోగులను జూచి మీరు జాలిపడుదురు, నమ్మినయెడల బాగు చేయుదురు. తండ్రీ! మీరు పాపములను పరిహరించువారు గనుక మీరు నా ఆత్మవైద్యుడవు. అలాగుననే నా శరీర జబ్బులు బాగుచేయువారు గనుక నా శరీర వైద్యుడవు కాబట్టి మిమ్మునే నా మనసులోను, బహిరంగములోను పూజింతును. ఎటువంటి వ్యాధియైనను ఎంత దీర్ఘకాల వ్యాధియైనను సుళువుగా ఒక్క క్షణములో మీరు బాగుచేయగలరని నమ్ముచున్నాను. మీరే నా దేవుడవు, మీరే నా రక్షకుడవు, మీరే నా పోషకుడవు, మీరే నా యొద్ద నిత్యము నివసింపగల సహవాసివి. అందుకే నన్ను మీవశము చేసికొన్నారు.

ఓ తండ్రీ! భూత పీడితులలోనున్న దయ్యములను వెళ్ళగొట్టుము. సంతానములేని వారికి సంతానము దయచేయుము మరియు

చిక్కులలోనున్న వారిని విడిపించుము. మీ సంగతులు లోకస్థులందరికి ప్రకటించుము. నాకు మీ బోధ తరచుగా వినిపించి, దానివల్ల నాలో నమ్మిక కలిగించుము. ఆ నమ్మికను బట్టి మీరు నాకు చేయదలచిన ఉపకారములు దయచేయుము. నా పాపములు, వ్యాధులు, నిత్యశిక్ష పరిహరించుటకై మీ ప్రాణము ధారపోసిన ప్రభువా! మీకనేక స్తోత్రములు. నేను మీయొద్దకు రావలసిన గడియలో మోక్షమునకు చేర్చుకొమ్ము. ఇట్లు మీరు నాలో కీర్తినొందుము అని మిక్కిలి వినయముతో వేడుకొనుచున్నాము. ఆమేన్.

# స్వస్థ ప్రార్థన-2

యేసుప్రభువా! పరమవైద్యుడా! మీరు ఇశ్రాయేలు దేశముయొక్క పట్టణములలో సంచరించి నానావిధ రోగులను స్వస్థపరచినారు. కాబట్టి వందనములు. అది గొప్ప సంగతి. మీరు ఒక్క మాట అన్నారు, నా శిష్యులు నా కంటె గొప్పవి చేస్తారన్నారు. పేతురుయొక్క నీడ తగిలి కొంతమంది బాగైరి, ఈ అద్భుతము మీరు చేసినట్టు లేదు, మీ శిష్యులు చేశారు. ఆలాగే ఇప్పుడు కాకానిలో ఈ వేళ మీ శిష్యులు ప్రార్థనచేస్తే చాలమంది రోగులు బాగైపోతున్నారు. అయితే మీరు బాగుచేసినారని భావిస్తున్నాము. అక్కడ పాలస్తీనాలో పబ్లిక్‌గా (బహిరంగముగా) తిరిగిన మీరు ఇప్పుడు లోకములో ఎక్కడ స్వస్థత కలుగుచున్నదో, అక్కడ ఉండి మీ సేవకులద్వారా స్వస్థత జరిగించుచున్నారు. మీరు నిన్న, నేడు, రేపు, నిరంతరము ఒక్క రీతిగానే ఉన్నారని పౌలు వ్రాసినమాట సత్యము. అప్పుడు బహిరంగముగా చేసిన పని స్వస్థత, ఇప్పుడు రహస్యముగా చేస్తున్న పని కూడ స్వస్థతే గనుక అప్పుడు స్తుతికి కారణభూతులు మీరే ఆలాగే ఇప్పుడును మరింత స్తుతికి కారణభూతులు కూడా మీరే. ఇప్పుడు బేతేలు గృహమునకు వచ్చిన వారిని గురించి కూడ ప్రార్థిస్తున్నాము.

అది కూడ స్వస్థతే. మేము చేసినట్లు కాదు, మీరు చేసినట్లే. ఆ ప్రార్థనలు రోగులు విని, ప్రార్థనలు చేస్తున్న స్వస్థత అని నమ్మినయెడల వారి హృదయములో కృతజ్ఞత ఉండును. తైలము తెచ్చుకొని దీవెన కోరుచున్నారు. నేను నా చెయ్యిచాపి దీవించక పోయినను, నోటిమాటతో మాత్రమే దీవించినప్పటికి, అది మీరు చెయ్యి చాపి తైలము మీదవేసి దీవించినట్టే అని వారు తెలుసుకొనిన యెడల ఎట్టి వ్యాధియైనను అంతరించును. అట్టి కృప తైలము తెచ్చుకొన్న వారికి చూపుము. పూర్వకాలమందే కాక నేడును మా తైలమునుకూడ యేసుప్రభువు ఆశీర్వదిస్తున్నారు. గనుక మాకు పర్వాలేదని తైలము రాసుకుంటే ఎంత ధన్యులు. మీవల్ల, మీ శిష్యుల వల్ల, పాలస్తీనాలో స్వస్థతపొందిన వారి సంతోషము వీరికినికూడ కలుగును. ఈ తైలము మీరు చెప్పినదే, బైబిలులో వ్రాయబడినదే, కాబట్టి శిలాక్షరముల వ్రాతలో పడినది మరియు నెరవేరినది గనుక మీకే మహిమ ఆమేన్.

# స్వస్థత ప్రార్థన

ఓ ప్రభువా! ఈ మీ బిడ్డలు ఈ దినమున ప్రాణమును గూర్చి, ఆత్మను గూర్చి, శరీరమును గూర్చి, స్వస్థత నిమిత్తమై నా శరీర జబ్బులను గూర్చిన ప్రార్థనకు మీ రక్తముతో ముద్రవేసి నాకు నేడే నెరవేరే స్వస్థత యిచ్చి నాకు మేలు కలుగునట్లు సహాయము చేయుమని వేడుకొనుచున్నాము.

ఓ ప్రభువా! ఈ బిడ్డ చేసిన ప్రార్థన విన్నావు గనుక బైబిలులో మీరు ఒక స్త్రీని చూచి అమ్మా! నీ బలహీనత నుండి విడుదల పొందియున్నావు అని చెప్పగా వెంటనే బలహీనత నుండి విడుదల పొందియుంది. కానాను స్త్రీ కుమార్తెను గూర్చి నీ కుమార్తె బాగుపడినది

అని చెపితే వెంటనే బాగు అయినది. ప్రధాని కుమారుడు మీరు చెప్పినట్లుగా వెంటనే బాగైనాడు, కుష్టిరోగి కూడ బాగైనాడు, పేతురు అత్త వెంటనే బాగైనది, కానాను ఊరిలోని పెండ్లిలో ద్రాక్షారసమును గూర్చి మీరు చెపితే నీళ్ళు వెంటనే ద్రాక్షారసముగా మారినది. మీ కార్యములన్ని వెంటవెంటనే జరుగుచున్నవి గనుక నా శరీరమునుగూర్చి, నా ప్రాణమును గూర్చి, నా బలహీనతను గూర్చి ఈ బిడ్డ అడిగియున్నది, గనుక నేడే ఈ దినమే వెంటనే సంపూర్ణ స్వస్థత యిచ్చి మహిమ పొందుదురని ప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము. తండ్రీ ఆమేన్.

## జబ్బుగా ఉన్నవారి కొరకు ప్రార్థనలు

*(మార్కు. 11:24వ వచనము మన ప్రార్థనకు ఆధారము)*

1) ఓ దేవా! సృష్టికర్తా! మా తండ్రీ! తలపోటు, మాడుపోటు, మతిచాంచల్యము, చుండ్రు, దురద, వెంట్రుకలు ఊడిపోవుట, తలకు పేలెక్కుట, ఈ విధమైన శిరస్సు బాధలు ఉన్నవారికి స్వస్థత దయ చేయుదురని నమ్ముచున్నాము. మీకు నమస్కారములు, ఆమేన్.

2) చెవిపోటు, చెవుడు, చెవిలో చీము కారుట, వినబడకపోవుట; ఈ విధమైన జబ్బులు గలవారికి స్వస్థత దయచేయుదురని నమ్ముచున్నాము. అలాగే చెవిలో స్వస్థత దయచేయుదురని నమ్ముచున్నాము.

3) కండ్లు కలుగుట, కంటిలో పువ్వులు, కంటి నొప్పి, మంటలు, దురదలు, నీరుకారుట, మసకగా కనబడుట, దృష్టిహీనత ఈమొదలైన వారికి స్వస్థత దయచేయుదురని నమ్ముచున్నాము.

4) నాసిక జబ్బు, పడిసెము, కొందరికి నాసిక రంధ్రము పెరుగుట, కాయలుండుట వలన వాటిని డాక్టర్లు కాల్చుదురు: అట్టి జబ్బులు ఏవైన ఉన్నవారికి స్వస్థత దయచేయుదురని నమ్ముచున్నాము. ముక్కుచీదుట, రక్తము

కారుట, ముక్కువ్యాధులు బాగుచేయుటకు డాక్టర్లు ఉన్నారని వెళ్ళుదురు; వారి దగ్గరనూ తగ్గనివి నేడిక్కడ బాగుచేయుదురని నమ్ముచున్నాము.

5) దగ్గు, క్షయ, రొంపదగ్గు అన్ని విధములైన దగ్గులు గలవారికి స్వస్థత దయచేయుదురని నమ్ముచున్నాము.

6) సంతానము లేనివారికి సంతానము దయచేయుదురనియు, ఇబ్బంది గలవారికి ఇబ్బంది తీర్చుదురనియు, అప్పుగలవారి అప్పులు తీర్చుదురనియు, విష పురుగుల బాధగలవారికి బాధ నివృత్తి, కోర్టులో అన్యాయము జరిగిన వారికి న్యాయము జరిగింతురనియు నమ్ముచున్నాము. చేతబడి, బాణామతి, శక్తిపూజ, మెస్మరిజం ఈ మొదలగు వాటివల్ల హాని పరిహరింతురని నమ్ముచున్నాము. పరీక్షలలో జయము కలుగు కృప, వివాహములో మంచి ఏర్పాటు కలుగు కృప, కుటుంబ కలహములు తీర్తురని నమ్ముచున్నాము. మీటింగులకు రావలెనని అనుకుంటే తక్కినవారు రానివ్వరు. అట్టి ఆటంకము తీసివేతురని నమ్ముచున్నాము. తల్లి దండ్రులలోని దుర్గుణాలు, వారిలోని జబ్బులు పిల్లలకు రాకుండ చేతురని నమ్ముచున్నాము. ధనాపేక్ష కలిగియుండు వారికి అట్టి అపేక్ష తీసివేతురని నమ్ముచున్నాము. గూడెంలో ఒకరికి, ఒక భక్తునికి ధనాపేక్ష కలిగినందున అతనికి చాంచల్యము కలిగినది ఇంకొకరికి జబ్బు, వేరొక నష్టము ఇట్టివి అనేకములు కలుగుచున్నవి. ఈ జాబితాలోని వాటిని పరహరింతురని నమ్ముచున్నాము.

## రోగులు చేసికొనవలసిన ప్రార్థనలు

ఓ యేసుక్రీస్తు ప్రభువా! మీరు వైద్యుడైయున్నారు గనుక వందనములు. మీయొద్దకు పూర్వకాలము ఎంతమంది రోగులు వచ్చినారో అందరిని బాగుచేసినారు గనుక నన్నును బాగుచేయుము. మీరు ఎటువంటి వ్యాధియైనను బాగుచేయగలరు గనుక నేను మిమ్మును నమ్ముకొనియున్నాను.

ఓ తండ్రీ తగిన ఔషధము దొరికేటట్టు చేసికూడ మీరు బాగుచేయగలరు మరియు ఔషధము లేకుండా కూడ బాగుచేయగలరు. మీ వాక్యమే గొప్ప ఔషధము గనుక మీ వాక్యము నాకు ఇంకను బాగుగా నేర్పించుము. ఓ యేసుక్రీస్తు ప్రభువా! మీరు దయ్యాలను వెళ్ళగొట్టితిరి ఇప్పుడు కూడ వెళ్ళగొట్టగలరు. పాపాత్ముల పాపములు క్షమించితిరి ఇప్పుడు కూడ పాపములను క్షమించగలరు. చనిపోయిన వారిని బ్రతికించితిరి. నేను మిమ్మును నమ్ముకొన్నాను గనుక మీరు ఎంత ఉపకారమైన చేయగలరు. నాకు నమ్మిక కలిగించి నా మనస్సులోకి అపనమ్మిక రానియ్యకుము, అవిశ్వాసము రానియ్యకుము, సందేహము రానియ్యకుము మరియు నా మనస్సులో ధైర్యము కలుగజేయుము. విసుగుదల కలుగును గనుక దానిని రానియ్యని ఓ తండ్రీ! మీకనేక నమస్కారములు.

నా మనస్సులో ధైర్యము, విశ్వాసము, నిరీక్షణ కలిగించుము, జబ్బులు బాగుచేయుము. నేను ఎల్లప్పుడు మీ సేవలో ఉందును. నాకు పరిపూర్ణ ఆరోగ్యము దయచేయుము. ఈ కాలములోకూడ అనేకమంది రోగులు మందులు వాడుకొనకుండ బాగు అగుచున్నారని అనుకొనుచున్నాను. నా ప్రార్ధనలు మీ కృపను బట్టి ఆలకించుమని వేడుకొనుచున్నాను. ఆమేన్.

## దైవిక స్వస్థత ప్రార్ధనలు

మహిమ ప్రభావములు గల తండ్రీ! మానవుని కొరకు సమస్త దానములు గల భూమి, ఆకాశములు కలుగజేసిన తండ్రీ! వందనములు.

మానవుడు తన జ్ఞానమును వినియోగించి మీరు కలుగజేసిన వాటిని వాడుకొని స్వస్థత నొందుటకు, సృష్టిలో మీ ప్రభావమును ఉంచిన తండ్రీ! నమస్కారములు. “నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే” అని పలికిన తండ్రీ! మీ ప్రవక్తల ద్వారా అనేక రోగములను స్వస్థపరచిన

మీకు స్తుతులు. కుమారుడవైన తండ్రీ! మీరే స్వయముగా మీ ప్రభావము చేత రోగులను స్వస్థపరచిన మీకు స్తుతులు.

ప్రభువా! పక్షవాతరోగి మీయొద్దకు తేబడి మిమ్ము అడుగకపోయినను, వాని హృదయములోనున్న కోరికను బట్టి స్వస్థపరచిన మీకు వందనములు.

దేవ మానవుడవైన ప్రభువా! సేన దయ్యములు పట్టినవాడు మిమ్ములను చూచి నమస్కరించిన చర్యను బట్టి, అతనిలోని దయ్యములను వెళ్ళగొట్టిన మీకు నమస్కారములు.

జీవమైన తండ్రీ! ఒక అధికారి వచ్చి "నా కుమార్తె ఇప్పుడే చనిపోయినది. అయినను మీరు వచ్చి మీ చేయి ఆమె మీద ఉంచుము, ఆమె బ్రతుకును" అనెను. అధికారి మిమ్మును కోరిన వెంటనే వెళ్ళి ఆ చిన్న దానిని బ్రతికించిన దేవా! మీకు ప్రణుతులు.

ఏర్పాటు రక్షకుడవైన ప్రభువా! కనాను స్త్రీ వచ్చి తన కుమార్తె స్వస్థతకొరకు ప్రాధేయపడి అడుగగా, ఆమె కుమార్తెను బాగుచేసిన మీకు వందనములు.

పరిశుద్ధుడవైన తండ్రీ! పదిమంది కుష్ఠరోగులు "మమ్మును కరుణించుమని" వేడుకొనగా వారి మనవి విని "మీరు వెళ్ళి యాజకులకు కనపరచుకొనుడని" చెప్పిన మీ మాట ప్రకారము వారు వెళ్ళుచూ దారిలో బాగుపడిరి. ఈ విధముగా స్థలాంతరమున బాగుచేసిన మీకు స్తోత్రములు.

"ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నారని నమ్ముడి, అప్పుడవి మీకు కలుగునని చెప్పుచున్నాను" అని సెలవిచ్చిన ప్రభువా! మేము ప్రార్థించినవియు, ఆశించినవియు నెరవేరనప్పుడు నెరవేరినవని నమ్మగల గట్టి విశ్వాస పద్ధతిని మాకు అలవరచిన మీకు వందనములు.

మా స్థితిని, గతిని ఎరిగిన తండ్రీ! మేమెంత ప్రార్థించినా నెరవేరనప్పుడు, మా ప్రార్థనాంశము మీ దివ్యచిత్తమునకు సంపూర్ణముగా సమర్పించి, మీ సహాయము కొరకు అబ్రాహాము వలె నిరీక్షింపగల కృప దయచేయుదువని నమ్ముచూ మీకు స్తుతులు చెల్లించుచున్నాను.

పరిశుద్ధాత్మవైన తండ్రీ! మీ సంఘమునకు మీ శక్తులను దయచేసి రెండువేల సంవత్సరములనుండి అనేకులను మీ ప్రభావముచే బాగుచేయుచున్న మీకు స్తోత్రములు.

మాకు కలిగిన...............(జబ్బు పేరు) అను ఈ అస్వస్థతను మీ పాదముల యొద్ద ఉంచి ప్రార్థన చేస్తున్నాము. మీ ప్రభావముచేత ఈ అస్వస్థతను తొలగించి స్వస్థత దయచేయుమని విశ్వాసముతో వేడుకొనుచున్నాము. ఈ స్తుతులు త్వరగా రానైయున్న యేసుక్రీస్తు నామమున అంగీకరించుము. ఆమేన్.

## శుద్ధి ప్రార్థన

యేసు ప్రభువా! నీళ్లవల్ల కలిగే శుద్ధియు, పాలవల్ల కలిగే శుద్ధియును అసంపూర్ణమైనది. ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తమువల్ల కలిగే శుద్ధి అశాశ్వతమైనది.

అయితే అవి ఈ లోకమునకు మాత్రమే పనికి వచ్చును. మీ అమూల్య రక్తమువల్ల కలిగే శుద్ధి పైలోకమునకు పనికి వచ్చేది. మేము రాబోయే కాలమందు మేము మీ సింహాసనము యొద్దను, మహిమలోను, దేవదూతల ఎదుటను, మీ పరిశుద్ధుల యెదుటను ఉండబోవుచున్నాము. అందుకు పనికివచ్చేటట్లు మమ్మును ఇప్పుడు మీ రక్తమువల్ల శుద్ధిచేయుమని వేడుకొనుచున్నాము. ప్రభువా! ఒకప్పుడు మీరు యూదుల ఎదుట నిలువబడి, నాలో పాపమున్నదని ఎవరు నిరూపించగలరు? అని పలికి మీ పరిశుద్ధతను వారికి చూపినారు. అట్లే మేమును నేడు లోకస్థుల

ఎదుట నిలువబడి నాలో పాపమున్నదని ఎవరు నిరూపించగలరు? అని పలికే ధైర్యమును, పవిత్రతను అనుగ్రహించుము. మా పరిశుద్ధత వెన్నెల వంటిదైనను, ఎండవంటిదైనను కాక, మీ పరిశుద్ధతవంటి పరిశుద్ధత దయచేయుమని ప్రార్థించుచున్నాము. ఆమేన్.

## విశ్వాస స్వస్థ ప్రార్థన

షరా:- గట్టిగా కండ్లు మూసికొనండి, గట్టిగా మనసు మూసివేసికొనండి, యేసుప్రభువునే తలంచుకొనండి అప్పుడు మీ జబ్బుపోవును. హోగరు ఏడ్చినట్లు కొందరు ఏడ్చి ప్రార్థన చేస్తే జబ్బుపోతుంది. ఒక దొరగారు రాజమండ్రిలో సైకిలుమీద అన్ని వీధులు తిరిగి అక్కడక్కడ జబ్బుగానున్న వారిని చూచి ఆస్పత్రికి రమ్మని చెప్పేవారు. రాకపోతే నిన్ను శిక్షిస్తాను అనేవారు. అతనికి ఆ మనిషిలోనున్న జబ్బు తెలియదు. గాని అనారోగ్యమున్నదని మాత్రము తెలుసు. అట్లే మీలోనున్న నమ్మిక మీకు తెలియదు గనుక నమ్మిక ఎక్కువ చేసికొనండి. అప్పుడు మీ జబ్బు వెంటనే పోవును, రేపు మాపు అని కాదు, ఇప్పుడే పోవునట్లు మీ నమ్మిక ఎక్కువచేసికొని బాగుపడండి.

దయారసముగల యేసుప్రభువా! కిడ్నీ చెడిపోయిన వారిని బాగుచేయగలరు. ఆ జబ్బుగలవారిని ఇప్పుడే బాగుచేయుము. మీరు డాక్టరువలె డబ్బు అడుగరు, లంచము అడుగరు మరియు ఉచితముగా బాగుచేస్తారు. చెవుడుగలవారిని కూడ బాగుచేస్తారు గనుక వీరిని ఇప్పుడే బాగుచేయుము. ఇప్పుడే అని చెప్పి పూర్వము బాగుచేసినారు గదా? మీ నమ్మిక చొప్పున మీకండ్లు బాగగునని చెప్పి, కండ్ల జబ్బుగల వారిని బాగుచేసినారు గదా! ఆలాగే ఇప్పుడు కూడ బాగుచేయుము ఉదర వ్యాధిగల వారిని బాగుచేసినారు గదా? అలాగే ఇప్పుడుకూడ బాగుచేయుము. విశ్వాసము లేనివారికి పూర్వము విశ్వాసము కలిగించినారు కాబట్టి ఇప్పుడుకూడ ఆ పని జరిగించుమని వేడుకొనుచున్నాము.

ప్రభువా! నాకు అపనమ్మిక కలుగకుండా కాపాడుమని ఒక బిడ్డ తండ్రి ప్రార్థించగా మీరు ఆలకించినారు. అలాగే ఇప్పుడు నమ్మిక లేనివారికి నమ్మిక కలిగించుము. శిరస్సునందుగాని, చెవులయందు గాని, కండ్లయందు గాని, నోటియందు గాని, గుండెయందు గాని, ఉదరమునందు గాని, మలమూత్ర అవయములందు గాని, చర్మము నందు గాని, రక్తమందు గాని జబ్బు ఉండేవారిని, వారి జబ్బునుండి మీరు దబ్బున లేపివేయగలరు కాబట్టి మీకు స్తోత్రములు. ఇట్టి పనులు మీరు పూర్వకాలమందు చేసారు. ఇప్పుడు పోర్టులాండులో, అమెరికాలో, ఆస్ట్రేలియాలో, ఇండియాలో, గుంటూరు వద్దనున్న కాకానిలో, అనేకయేళ్ళ తరబడి నుండి నేటికిని అనేకమందిని బాగుచేయుచున్నారు. ఇప్పుడు గదిలోనున్న రోగులు వారిలోని అవిశ్వాసమును బట్టి ప్రార్థించకొనలేక పోవుచున్నారు. గనుక వారి తరపున మేము చేసినాము. రమ్ము స్వస్థపరుచుము, వారు ప్రార్థన కోరినారు, మేమును కోరినాము. ఎందుకంటే, మీరు మనుష్యులందరి కొరకు ప్రార్థించుమని మీ గ్రంథములో వ్రాయించినారు గనుక యేసుప్రభువా మీకనేక నమస్కారములు, అనేక వందనములు, అనేక స్తోత్రములు. మీరు దేవుడవు గనుక ఎటువంటి ఉపకారమైన చేయగలరు. మా కొరకు మీరు మనిషివైనారు. మాలో ఒకరైనారు అందుచేత మమ్ములను బాగుచేయగలరు గనుక మీకు చిరకాల నమస్కారములు. ఆమేన్. ఆమేన్. ఆమేన్.

# IV. సృష్టి కొరకైన ప్రార్థనలు

## సృష్టికొరకైన ప్రార్థన

సర్వజనులకు తండ్రివైన దేవా! మీ సృష్టి కార్యముల నిమిత్తమై మీకనేక స్తోత్రములు. మానవులందరును మిమ్ము ఆరాధింపవలెనను ఉద్దేశ్యముతో అందరు అన్ని మతములను స్థాపించుకొన్నారు గాని

ఒకరికొకరు మా మతము దైవ మతమని చెప్పుకొను గుణమున్నది. కొన్ని విషయములలో భేదములున్నను అన్ని మతములు ఒకటే అని కొందరనుచున్నారు, అట్లనరాదని కొందరనుచున్నారు. తండ్రీ, మీరు అందరికిని సత్యమును బైలుపరచుమని యేసు నామమున వేడుకొనుచున్నాము.

ఓ దేవా! తండ్రీ! మీ మహిమను అనుభవించుటకై, నన్ను కలుగజేసిన మీకు అనేక స్తోత్రములు. మీ అనుగ్రహ దానములగు భూమి, ఆకాశముల నిమిత్తమై మీకనేక వందనములు. మీ విషయము పూర్తిగా తెలిసికొనగల బైబిలు గ్రంథమును దయచేసినందులకు మీకనేక స్తుతులు. అది గ్రహించుటకు మీ ఆత్మ సహాయము నిమ్ము, నన్ను అనుదినము పవిత్రపరచుచుండుము. మీ చిత్తానుసారముగ నన్ను నడిపించుము, నాకు ఏమి ఇవ్వవలెనని మీకున్నదో అదే ఇమ్ము. నాతో ఏమి చేయింపవలెనని ఉన్నదో అదియే చేయించుము. తుదకు నన్ను మీ యొద్దకు తీసుకొని వెళ్ళుము మీరే అన్ని విషయములలో నాకాధారమై ఉన్నారు గనుక మీకే మహిమ కలుగును గాక! క్రీస్తుయేసు నామమున అంగీకరించుము. ఆమేన్.

## సృష్టికర్తకు చేయు స్తోత్ర ప్రార్థన

**1. దైవలక్షణములను గురించి స్తుతి ప్రార్థన:-** ఇది అన్ని మతములవారు చేయదగిన స్తుతి.

(1) సృష్టికర్తవైన మా తండ్రీ! మా దేవా! మేము పుట్టకముందే మా మేలు నిమిత్తమై ఆకాశమండలమును దానిలోని సమస్తమును, భూమండలమును దానిలోని సమస్తమును కలుగజేసిన ప్రభువా! మీకు అనేక నమస్కారములు. పిమ్మట మమ్మును కలుగజేసిన తండ్రీ! మీకు అనేక నమస్కారములు.

(2) ఆదిగాని, అంతముగాని లేని శాశ్వతుడవైన దేవా! మీకు అనేక నమస్కారములు.

(3) జీవమైయున్న మా దేవా! మేము సుఖముగా జీవించుటకు మాకు జీవమిచ్చినారనియు, మరణసమయము రాగా మరణమును తప్పించి జీవమును సాగించుచున్నారనియు, మాకు నిత్యజీవనము కూడ ఇచ్చెదరని మీకు నమస్కారము చేయుచున్నాము.

(4) జ్ఞానవంతుడవైన దేవా! మేము మా కష్టసుఖములు మీకు చెప్పకపోయినను మీరు జ్ఞానివైయున్నందున మీరు తెలిసికొని మా కోరికలు నెరవేరుస్తారని మిమ్మును నమస్కరించుచున్నాము.

(5) ప్రేమరూపివైన దేవా! మేము ఎంతగొప్ప పాపులమైనను మీరు ప్రేమవైయున్నందున మమ్ములను క్షమింతురని మిమ్ములను నమస్కరించుచున్నాము.

(6) న్యాయవంతుడవైన దేవా! మేము ఎంత గొప్ప అవిధేయత గల వారమైనను మీరు న్యాయమైయున్నందున మమ్మును దిద్దుటకు శిక్షింతురని మీకు నమస్కారము చేయుచున్నాము.

(7) శక్తిమంతుడవైన దేవా! మేము పాపమును విసర్జించుటకు గాని, భక్తిగా నడచుటకు గాని, తగిన శక్తి లేనివారమైనను మీరు శక్తిమంతులై ఉన్నందున మా పనులు చేయుటకు శక్తిని దయ చేయుదురని మిమ్ములను నమస్కరించుచున్నాము.

(8) పరిశుద్ధుడవైన దేవా! మేము పాపులమైయున్నందున అపరిశుద్ధత గలవారమై ఉన్నాము, మీరు పరిశుద్ధులై ఉన్నందున మమ్మును శుద్ధిచేయుదురని మీకు నమస్కారము చేయుచున్నాము.

(9) సర్వవ్యాప్తివైన దేవా! మేము ఎక్కడ ఉన్నను మీరును అక్కడనే ఉండి మమ్మును కాపాడుదురని మిమ్మును నమస్కరించుచున్నాము.

(10) నిరాకారుడవైన దేవా! ఆకారముగల మా శరీర నేత్రములకు మీరు కనబడక పోయినను మేము మిమ్మును చూచుటకు ఆత్మనేత్రమను అనుగ్రహింతురని మిమ్ములను నమస్కరించు చున్నాము.

(11) స్వతంత్రుడవైన దేవా! మీరు మాకు ఇచ్చిన వాటిని స్వేచ్ఛగా వాడుకొనలేని వారమైనను మీరు స్వతంత్రులై ఉన్నందున మీ స్వతంత్రత మీద ఆధారపడి మా స్వతంత్రతను సద్వినియోగపరచునట్టి స్వాతంత్ర్య బుద్ధి అనుగ్రహింతురని మిమ్ములను నమస్కరించుచున్నాము.

(12) ఆకాశమును, భూమిని మేము అనుదినము చూచుట వలన మీరు ఉన్నారని మేము తెలిసికొనగల జ్ఞానమును, మా విషయములో మీరు చేయు సమస్త కార్యములను సమ్మతించునట్లు మనస్సాక్షిని మాలో అమర్చినారని మిమ్మును నమస్కరించుచున్నాము.

(13) అద్భుతకరుడవైన దేవా! ఆకాశమును, భూమిని మేము చూచుట వలననే కాక ఇంకను అనేకమైన ఇతర వస్తువులను, చరిత్రలను చూచుట వలన కూడ మీ విషయములు మాకు అర్థము కాగల వీలు కలిగించుచున్నారని మిమ్ములను నమస్కరించుచున్నాము. ఈ మా స్తుతులను అనుదినము మేము మీ వలన అనుభవించుచున్న ఉపకారముల విషయమై చేయవలసిన కృతజ్ఞతా స్తుతులను మీ మహామహోన్నత స్థితిని బట్టి ఆలకింతురని మిమ్మునువేడుకొనుచున్నాము.

(14) దేవా! తేజోమయమగు లక్షణములలో ఒక్క లక్షణము ద్వారా మాకు ఉపకారము చేయునప్పుడు దానితోపాటు తక్కిన లక్షణములన్నియు ఆ కార్యమునే చేయుచుండునంత ఏక లక్షణముగా ఉన్నట్లు, మేము భావించుకొని మిమ్మును నమస్కరించుచున్నాము. ఆమేన్.

# వేసవి ప్రార్థన

దేవా! సృష్టికర్త! మా తండ్రీ! మీకు మా హృదయపూర్వక వందనములు, తండ్రీ! పూర్వకాలమున ఇశ్రాయేలీయులకు అరణ్య మార్గమందు నలుబదియేండ్లు మేఘమును గొడుగుగా పట్టినారట అందుచేత వారికి ఎండదెబ్బ తగులలేదు. ప్రార్థన చేసిన ప్రతివారి మీదికి మేఘమును పంపించినారట గనుక మాకు కూడా అట్టి ఉపకారము దయచేయుము.

ప్రభువా! కాలమానము వలన కలుగు కీడు రాకుండా కాపాడుము వేసవికాలమందు వచ్చే వడగాల్పుల వలన హానిరాకుండా కాపాడుము. నేటి కాల భయంకరమైన వేడి గాల్పుల వలన పక్షులు, మనుష్యులు చనిపోవుచున్నారని వార్తాపత్రికల ద్వారా తెలియుచున్నది గనుక మాకు హానిరాకుండా కాపాడుమని వేడుకొనుచున్నాము. ప్రభువా! ఎండవలన కలుగు హాని తప్పించుకొనుటకు మానవులకు జ్ఞానము యిచ్చినందువలన పాదరక్షలు, గొడుగులు మొదలుగునవి కల్పించినారు గనుక మీకు వందనములు.

వేసవికాలమున కాళ్ళుకాలుట వలన, దాహమగుట వలన, నీటి కొదువ వలన, యిండ్లు కాలుట వలన కలుగు శ్రమల వలన నరులు సృష్టికర్త వైపు తిరుగవలెనని యేర్పాటైనది గనుక రాకడ ముందు ఎండాకాలమందు కలుగుచున్న బాధలు ఏడేండ్లు పరిశుద్ధపాలనలో కలుగు బాధలకు ముంగుర్తులైయున్నవి గదా! ఇవి చూచి సువార్త వినువారు అవి తప్పకుండా ఉన్నవని తప్పించుకొనుటకై సిద్ధపడుట కొరకు ఈ కాలమానములు సాధనములైయున్నవి గనుక మీకు వందనములు.

తండ్రీ! వేసవి కాలములో ప్రయాణము చేయువారికి చలువచేయు ఫలవృక్షములు దయచేసినందుకు మీకు స్తోత్రములు.

నీతి సూర్యుని రెక్కల క్రింద ఆరోగ్యము కలదు. మానవులకు హాని కలిగించునట్టి క్రిములు సూర్యరశ్మి వలన అంతరించి పోవును,

అపవిత్ర స్థలములు శుభ్రమగును. వేసవి కాలము మా ఉపయోగార్థము యేర్పరచినారు గనుక స్తోత్రము. ప్రభువా! మా పాపములను మా అయోగ్యతలను క్షమించి భయంకరమైన వేడి గాల్పుల నుండి రక్షించుమని నీతి సూర్యుడైన యేసు ప్రభువు వారి పుణ్యనామములో వేడుకొనుచున్నాము తండ్రీ. ఆమేన్.

# వర్ష ప్రార్థన

***నా నామమునుబట్టి మీరు నన్నేమి అడిగినను నేను చేతునని ఆయన సెలవిచ్చెను. యోహాను 14:14.***

***అతడు మరల ప్రార్థన చేయగా ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెను. యాకోబు 5:18.***

మింటి దృష్టిగల సహకారులారా! చలవ చలవ!

1. దేవా! మీరు మాకు ఉచితముగా ఇచ్చుచున్న దానములలో ఒకటియగు వర్షదానము నేడు కొదువగా ఉన్నది గనుక ఈ కొదువను తీర్చుమని వేడుకొనుచున్నాము. తండ్రీ! మీ ఆజ్ఞలు నెరవేర్చునప్పుడు "మీ దేశమునకు వర్షము అనగా తొలకరి వానను, కడవరి వానను దాని దాని కాలమున కురిపించెదను" (ద్వితీ. 11:14) అని వాగ్ధానము చేసినారు గనుక నెరవేర్చుము. గాలి తుఫాను వలన గాని, అధిక వర్షము వలనగాని, హాని రానీయకుము. మాకు ఎంత వర్షము అవసరమో అంత వర్షము కురిపించుము, ధాన్యాదులు సమృద్ధిగా పండించుము. అనాది దేవా! సృష్టి ఆది నుండి నేటివరకు లోకమునకు వర్షమును ధర్మము చేయుచున్న మీకు అనేక స్తోత్రములు. ఆమేన్.

2. (1) సృష్టికర్తవైన తండ్రీ! గతకాల ఉపకారములకు మీకనేక వందనములు. మాకును, జీవరాసులకును దాహశాంతి కలుగునట్లును, పొలములు, చెరువులు, తోటలు, ఇతర స్థలములలోని వృక్షములు

ఫలించునట్లును, వేడిమి తగ్గునట్లును, చెరువులు, బావులు, నదులు, నిండునట్లును వర్షమును పంపించుము. సమృద్ధిగల వర్షమును పంపుము. ఎక్కడ అవసరమో అక్కడను, ఎంత అవసరమో అంతయును, ఎప్పుడు అవసరమో అప్పుడును, కురిపించుము. (2) అధిక వర్షమువల్ల మనుష్యులకు, ఇండ్లకు, పశ్వాదులకు, పంట భూములకు, నౌకాదులకు హాని కలుగుచున్నది గనుక కావలసినంత వాన మాత్రమే రప్పించుము. (3) మేము ప్రార్థించక పోయినను వర్షదానమను గ్రహించుచున్న మీరు, ఇప్పుడు ప్రార్థించుచున్న ఈ సమయమున మా పాపములు క్షమించి, నిశ్చయముగ వర్షదానమును అనుగ్రహింతురని నమ్ముచు మిమ్మును వందించుచున్నాము. తథాస్తు (ఆమేన్).

3. యేసుప్రభువా! మీరు లేకుండా ఏమియు కలుగలేదని బైబిలులో వ్రాయించిన తండ్రీ! నా నామమందు మీరేమి అడిగినను మీరు చేతురని వాగ్దానమిచ్చిన దేవా! ఆకాశము నుండి మా భూమిమీదికి వర్షమును కుమ్మరించుమని వేడుకొనుచున్నాము. మీకనేక స్తోత్రములు ఆమేన్.

4. అనాది దేవా! సృష్టి ఆది నుండి నేటి వరకు లోకమునకు వర్షమును ధర్మము చేయుచున్న మీకు అనేక స్తోత్రములు. దేవా! సమస్తమును, మమ్మును, వర్షమును కలుగజేసిన తండ్రీ! మాకిప్పుడు వర్షము మిగుల అవసరముగా ఉన్నది గనుక వర్షమును కురిపించుమని సృష్టికర్త అయిన యేసుక్రీస్తు నామమున వేడుకొనుచున్నాము తండ్రీ! ఆమెన్.

## నీటి కొరకైన ప్రార్థన

దయగల ప్రభువా! మాకిప్పుడు (మీ గ్రామము (ఊరు) పట్టణము పేరు) గుంటూరులో నీటి ఇబ్బంది ఉన్నది. హాగరుకు నీటి ఇబ్బంది కలుగగా ఎలుగెత్తి ఏడ్చినది. అదే పరిస్థితి మా గుంటూరుకు వచ్చినది. నీరు దొరుకుచున్నది గాని సరియైన నీరు దొరుకుటలేదు. హాగరుకు

దొరికిన నీరు దొరుకుట లేదు. చిన్న పిల్లల మొర ఆకాశమునకు వినబడునన్నారు. ఎవరైనా మీ సృష్టే. హాగరు మీ బిడ్డ గనుక మీరు నీళ్ల ఊట చూపారు. మేమును మీ బిడ్డలమే గనుక మాకును అటువంటి నీటి ఊటలను చూపుము. అయితే హాగరు ఎలుగెత్తి ఏడ్చినది, మేము ఏడ్చుటలేదు. నీటి ఇబ్బందిని గూర్చిన ప్రార్థన అని ఒక పత్రికలో వ్రాసినారు గనుక దీవించుము. ఒక బిడ్డ మొరను వినియున్నారని ఉన్నది. అలాగే మా మొరను కూడ వింటారు మమ్మును రక్షించు నిమిత్తమై మా మొర ఆలకించుము. అన్యులు మీ బిడ్డలు అనగా ఏర్పాటు బిడ్డలు కాదుగాని సృష్టిని బట్టి మీ బిడ్డలే గనుక దీవించి నీటిని సమృద్ధిగా దయచేయుమని క్రీస్తు నామమున అడుగుచున్నాము తండ్రీ! ఆమెన్.

# V. సైతానును బంధించు ప్రార్థనలు

## సాతానును బంధించు ప్రార్థన

త్రియేక దేవుడవైన తండ్రీ! అన్నిటిలో ఉన్న తండ్రీ! అందరి తండ్రీ! ఆకాశమందున్న తండ్రీ! మీ నామమున ప్రార్థించుచున్నాము. మేము మీ నామమును బట్టి ప్రార్థించుచున్నాము. వేరొక నామమునుబట్టి ప్రార్థిస్తే మా ప్రార్థనలు నెరవేరవు కాబట్టి మీ నామమును బట్టి ప్రార్థించుచున్నాము. “నా నామమును బట్టి మీరు ఏది అడిగినను చేస్తానన్నారు” వేడుకొనకముందు దయచేస్తానన్నారు కాబట్టి నా మనస్సులో ఏమి ప్రార్థనలు ఉన్నవో మీకు ముందుగానే తెలుసును. మరియు మేము మనవి చేయుచుండగా మీర నెరవేరుస్తారు అని అన్నారు కాబట్టి ఈ రెండు వాగ్దానములు ప్రవచన పంక్తులను బట్టి తగిన ప్రార్థనలు చేయుచున్నాము. దేవునియొక్క సింహాసనము జ్ఞాపకము తెచ్చుకొని సాష్టాంగపడి ప్రార్థించుచున్నాము. మా ప్రార్థనలు ఆలకించుము. మీకు అనేక నమస్కారములు. ప్రభువా! నరవంశమును బట్టి మేము పాపులము.

స్వజనము బట్టి, మా పూర్వీకులను బట్టి, మా తల్లిదండ్రులను బట్టి, పుట్టుటను బట్టి పాపులము. మీ పేరు ఎత్తుటకైనను తగనివారము అయినను మీరు మమ్ములను మీ సన్నిధికి రానిస్తూన్నారు. మీకు వందనములు. మేము అయోగ్యులము గనుక మీ కృపను పొందుటకు తగనివారము. మీరు గొప్ప దేవుడవు గనుక మీకు ప్రణుతులు.

ఇంత గొప్ప పాపులమైన మాపై ఇంత గొప్ప కృప చూపించుచున్నారు. మేము వేడుకొనక ముందే ప్రార్థనలు ఆలకించినారని, మనవి చేస్తుయుండగానే విని ఉన్నారు. మీ యెదుట మా అయోగ్యతను ఒప్పుకొనుచున్నాము. తండ్రీ! మమ్మును శోధించుచున్నట్టి, ఈ పాపములో పడవేయుచున్నట్టి సైతానును బంధించివేయుము. మేము ప్రతి ఇబ్బందివద్ద నలుగుచున్నాము. భూతములను బంధించియున్నట్టి మీరు ఇప్పుడు మా ఎదుట సైతానును బంధించుము మరియు భూమి మీద మేము అతనిని బంధించుచున్నాము అని వాగ్దానము చేసియున్నారు గనుక మత్తయి 18:18 బట్టి వేడుకొనుచున్నాము. మా ప్రభువా! అతనిని ఇదివరకే బంధించియుంటే, ఇప్పుడు మా జోలికి రాకపోవును. ఎలాగు చెలరేగుచున్నాడో చూచుచున్నారు కదా! అతనికి మీరిచ్చిన స్వాతంత్ర్యమును, మీరు మాకిచ్చిన సెలవు, స్వాతంత్రముతో బంధించుచున్నాము. పరలోకములో కూడ బంధించుము అప్పుడు అతడు మా జోలికిరాడు. మా మిషను పనిద్వారా వాడిని నివారణ చేసుకొనగలము. మమ్ములను మీ సన్నిధికి రానిచుచున్నారు. ప్రభువా! అపవాది యొక్క క్రియలను నాశనము చేయుటకే దేవుని కుమారుని ప్రత్యక్షపరచినందుకు మీకు వందనములు. పిశాచిని బంధింపవలెను అని ఇప్పుడే మనవి చేసియున్నాము. అతని క్రియలు, ఆలోచనలు, పన్నాగములను, ప్రయత్నములను, విషసంబంధమైన నడతలను బంధించుము. వాడి దండును నాశనము చేయుము.

తండ్రీ! అపవాదిని ఎదిరించుడి అప్పుడు అతడు పారిపోవును అని వ్రాయించినారు గనుక మాకు సైతానును ఎదిరించే సింహపు గుండె దయచేయుమని వ్రాసికొన్నాము. ఆ మనవి మీరు అంగీకరించుము. మేము ఈ ప్రార్థనలు చేసినప్పటికిని, అతడు మొండితనముగా మాయొద్దకు వచ్చును గనుక వాడిని నిత్యము ఎదిరించు సింహపుబలము దయచేయుము. అతడు వచ్చునప్పుడెల్లా మా గద్దింపు విని పారిపోవునట్లు మీ వాగ్ధాన బలము, ధైర్యము మాకు దయచేయుము. ఆమేన్.

## సాతానును బంధించుట

(ఈ ప్రార్థన ప్రతి దినము చేసిన మేలు కలుగును)

1. ఓ మా తండ్రీ! నీ సంఘము ఎదుట పాతాళ లోక ద్వారములు నిలువబడనేరవని మత్తయి 16:18లో వాగ్ధానము చేసియున్నారు. కాబట్టి మీకు స్తోత్రములు.

2. ప్రధానదూత పాపము చేసినప్పుడు వానిని విడిచిపెట్టక పాతాళమందలి బిలములో, కటిక చీకటిలోకి త్రోసి, తీర్పు వరకు బంధించినారు గనుక పిశాచములు, దయ్యములు, మృత్యుదేవత, కర్మ దేవతలన్నిటికిని అధికారియగు సాతానును పాతాళమందు బంధించినారు కాబట్టి మీకు వందనములు.

3. లూసిఫర్ అను ప్రధానదూతను నరకములో ఒక మూలకు త్రోసివేసినారు కావున మీకు వందనములు.

4. పాములను, తేళ్ళను త్రొక్కుటకు, శత్రువు బలమంతటిమీద మాకధికారమిచ్చిన తండ్రీ! మీకు వందనములు.

5. సాతానుకు సమాధిలేదు, వాడు పారవేయబడిన కొమ్మ, ఖడ్గముచేత పొడవబడినవాడు. అనగా విశ్వాసుల వాక్య ఖడ్గము, స్తుతుల ఖడ్గము, ఆత్మ ఖడ్గము, ప్రార్థనా ఖడ్గము, నరహస్త ఖడ్గముచేత పొడవబడినవాడు. ఈ రీతిగా సాతానును జయించు శక్తి ఇచ్చిన తండ్రీ! వందనములు.

6. చచ్చినవారి శవములచేత కప్పబడినవాడు, త్రొక్కబడిన పీనుగు వంటివాడు, మట్టులేని గోతిలోనికి దిగిపోయెడివాడు, మా కాళ్ళచేత చితక ద్రొక్కబడేవాడు సాతాను. సాతానును జయించి సిలువపై నుండి యేసుప్రభువా! మీరు త్రొక్కిన రీతిగా సాతానును జయించే శక్తి, బంధించే శక్తి ఇచ్చిన తండ్రీ! మీకే మా హృదయపూర్వక వందనములు. ఆమేన్.

# దయ్యములను వెళ్ళగొట్టు ప్రార్థన

1. ఓ ప్రభువా! మార్కు 16:17 లో, మీరు దయ్యములను వెళ్ళగొట్టుడని తెలియపర్చినావు. వెళ్ళగొట్టుదురని ప్రవచించినావు. గనుక మేము అడుగుచున్నాము. మా మీదికి వచ్చిన దయ్యములను వెళ్ళగొట్టుము

2. "అపవాదిని ఎదిరించుడి. అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును". అని యాకోబు 4:7లో వ్రాయించినారు. గనుక ఎదిరించు శక్తిని అనుగ్రహించుము.

3. "సాతానును శీఘ్రముగా మీ పాదముల క్రింద త్రొక్కించెదనని" కూడ రోమా 16:20లో వ్రాయించినారు గనుక అది ఇప్పుడు నెరవేర్చుము. సన్నిధి కూటస్తులు మీ సెలవు అడిగి వెళ్ళగొట్టేటట్లు ఏర్పరచుము.

# అంధకారముపై అధికారమునిచ్చే ప్రార్థన

ఎ) ఓ దేవా! లోకములోనికి పాపమును ప్రవేశపెట్టిన సైతానుకు మాపై ఏ అధికారము లేకుండ చేయుము. శత్రువు యొక్క బలమంతటి మీదను అధికారము ఇచ్చియున్నారని వ్రాయించిన దేవా! మీకు స్తోత్రము. పిశాచిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ వద్దనుండి పారిపోవునని వ్రాయించిన ప్రభువా! వాడిని, వాడి అధికారమును పారదోలే విశ్వాసమును అనుగ్రహించుము. అపవాది తన యొక్క బలమును, జ్ఞానోపాయమును, సర్వాధికారమును ఉపయోగించుచున్నప్పుడు మీరు వ్రాయించిన మాటలు

మాకు జ్ఞాపకముచేసి మాకు ధైర్యము, బలము దయచేయుము. మీ వాక్యము ఎట్లు ఉపయోగించితే అతడు పారిపోవునో మాకు నేర్పుము. అతని అధికారమునకు మా హృదయములో ఏమాత్రమును ఇష్టాంగీకారము చూపకుండునట్లు మీ కృప దయచేయుము. ఏ చిన్న విషయములోనైనా అతని అధికారమునకు ఒప్పుకొనకుండునట్లు మాకు పవిత్రమైన నిష్ట దయచేయుము. ఓ ప్రభువా! మీరు అపవాదిని జయించియున్నారు. గనుక అతని అధికారముకూడ జయింపబడినదని గ్రహించుచున్నాము. మీకు వందనములు. అతడు ఎంతో అధికారమున్నట్లు చూపించేటప్పుడు సహితము, అతనికి అధికారములేదనే తలంపు మాకు జ్ఞాపకము చేయుము. అపవాది జయింపబడిన శత్రువని మేము మరువకుండునట్లు మీ కృప దయచేయుము. అపవాది బంధింపబడిన వాడనియు, అపవాదియొక్క క్రియలను లయము చేయుటకు, దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను అనే వాక్యము మీ గ్రంథములో ఉన్నదనియు, ఈ వాక్యమే మాకు అపవాది మీదను, అతని క్రియల మీదను, మాకు జయమిచ్చినదనియు మాకు జ్ఞాపకము చేయుము. "అనేక మందిని అనగా గొప్ప గొప్ప వారిని సహితము మోసపర్చిన అతడు మమ్ములను మాత్రము మోసపర్చడా?" అనే తలంపు అతని రాజ్యము నుండి వచ్చిన తలంపే అని మాకు జ్ఞాపకము చేయుము. ఆమేన్.

బి) ఓ దేవా! సైతాను కారణముచేత మానవులమైన మాలో ప్రవేశించిన సాతాను నైజమునకు మామీద అధికారము లేకుండా చేయుము. అపవాది క్రియలకు లయము. క్రీస్తు యేసు రక్తము, శరీరములకు జయము. "ఈ శరీర నైజము, ఈ శరీరము భూస్థాపనయినప్పుడే పోవును. గాని మరియెప్పుడు పోదు" అని లోకులు అనేమాట లెక్కచేయము. ఎందుకనగా 'మాకు నూతన సృష్టి దయచేయుదురని మీ వాక్యములో ఉన్నది గనుక అది మాకు దయచేయుము. ఆమేన్.

ఓ దేవా! మీరు ఒకప్పుడు భూమిమీద ఉన్నప్పుడు మనుష్య నైజము కల్గియున్నప్పటికిని నరునిలోని నరస్వభావమును కల్గియుండలేదు. మీకు స్తోత్రము, అయితే పవిత్రమైన నరస్వభావమే ధరించుకొన్నారు. స్తోత్రములు. అందుచేతను నరస్వభావమును మీరు పరిహరింపగలరు. ఆది తల్లిదండ్రులకు మీరిచ్చిన పరిశుద్ధత, నరస్వభావము మాకును ఇవ్వగలరు గనుక మీకు స్తోత్రములు.

ఓ దేవా! మాలోని మానవ స్వభావమును మీరు తీసివేయుము. అప్పుడు మా నైజములో నుండి మాకు మంచి తలంపులు, మంచి వినికిడి, మంచి చూపు, మంచి పాటలు, మంచి చర్యలు, మంచి క్రియలు, మంచి బ్రతుకు కలుగును గనుక మీకు స్తోత్రములు. ఓ ప్రభువా! మీ మానవ స్వభావమునకే మాలో అధికారముండును గాక! ఆమేన్.

మీరు సర్వశక్తిగల వారును, జ్ఞానోపాయము గలవారును అగుటవల్ల సంగతులను ఎటుబడితే అటు తిప్పగలరని నమ్ముచున్నాము. ఓ దేవా! మేలు కలిగినప్పుడు మేమెంత సంతోష భరితులమౌదుమో, కీడు వచ్చినప్పుడును, ఆ రీతిగానే సంతోషించే ఆత్మను దయచేయుము. కీడు మాకు వినబడినప్పుడు, "మా తండ్రి మాకు ఇదివరకు ఉన్న దీవెనకంటే గొప్ప దీవెన అనుగ్రహించే సమయము వచ్చినదని" ఆనందించే ఉద్రేకము అనుగ్రహించుము, పిల్లవాడుగా ఉన్నప్పుడు తల్లిదండ్రుల ప్రేమను బాగుగా తెలిసికొనును. అలాగుననే ఓ దేవా! కీడు వచ్చినప్పుడు మీ ప్రేమను మేము ఎక్కువగా తెలుసుకొనే జ్ఞానము దయచేయుము. ఏలియాకు నీళ్లు వచ్చే మార్గము, రొట్టెలు వచ్చే మార్గము మూయబడినప్పుడు అప్పములు వచ్చినవి. అరణ్యములోకంటే శ్రేష్టమైనవి మరియొక విశాల మార్గము సిద్ధమైయుండెను. అట్లే ఓ తండ్రి మీ బిడ్డలకు సహాయము ఒక విధముగా ఆగిన యెడల మరియొక విధముగా రప్పించెదరు. ఎందుకనగా అన్నీ మీ స్వాధీనములో ఉన్నవి, అన్ని మీకు లోబడును. ఓ దేవా! ఏదైన కీడు

వచ్చేటప్పుడు దానికి మేము కారకులమైయున్న యెడల మాకు దిద్దుబాటు అనుగ్రహించుము. మంచి విషయములు కనబడనప్పుడు, మా నైజము స్థిరముగా కదలకుండునట్లు కాపాడుము. ఓ ప్రభువా! వర్షింపకుండునట్లు మేఘములు బంధింపబడినప్పుడును సూర్యరశ్మి కనబడుకుండునట్లు సూర్యుడు మరుగైనప్పుడును, గాలికి వృక్షములు స్థానము తప్పినప్పుడును, సమస్తము అంధకారముగా తోచినప్పుడును, నలుదిశలా కీడే తలెత్తి చూచినప్పుడు సహితము మేము నిరాశ చెందక, స్థిరనైజమును, విశ్వాస నైజమును కలిగియుండే కృప దయచేయుము.

# VI. సందర్భ ప్రార్థనలు

## జన్మదిన ప్రార్థన

ఓ దయగల తండ్రీ! లోకములోనున్న ప్రతివారియొక్క జన్మదినము గొప్పదైయున్నది. మీరు ఏర్పాటు చేసిన వ్యక్తులు ఎప్పుడు జన్మించవలెనో అప్పుడే వారిని జన్మింపజేసినారు. ఒకరి యొక్క జన్మచరిత్ర బైబిలులో అద్భుతరీతిగా వ్రాయించినారు. యిర్మియా 1:4 ఆయన యొక్క తల్లి గర్భములో ఉండగానే 'నిన్ను ఏర్పర్చుకున్నాను' అని అన్నారు. ఆ మాట ఎవరిని గురించి లేదు. పౌలు, పేతురులను గురించి కూడ లేదు. గొప్ప ప్రవక్తయిన యెషయాను గురించి కూడ లేదు. యెషయా గ్రంథము ముందు చదివి, ఆ తరువాత నాలుగు సువార్తలు చదివినవారు తేడా లేదని ఆనందిస్తారు. అటువంటి ఆయనను గురించి కూడ ఈ మాట చెప్పలేదు. దయగల ప్రభువా! నీ కుమార్తెను లేక కుమారుని ఏ ఉద్దేశముతో ఈ లోకమునకు పంపి, బైబిలుమిషనులో చేర్చినారో ఆ మీ ఉద్దేశమును సంపూర్తిగా నెరవేర్చుకొనుము, నెరవేర్చుటవల్ల మీరు మహిమ పొందుదురు. జన్మము ఉన్న ప్రతివారికిని మరణమున్నది, ఉండి తీరాలి.

అయితే ఈ కడవరి దినములలో రాకడకు ముందు అనేకమందికి మరణముండదు అని సువార్తవల్ల తెలుస్తున్నది గనుక ఈ నీ కుమార్తెను లేక కుమారుని ఆ శాఖకు సిద్ధపర్చుము. తన కుటుంబములో ఉన్న ప్రతివారిని దీవించుము. తన కుటుంబములో మొలచిన సన్నిధికూటమును వృద్ధిలోనికి తీసికొని రండి ఇంకను వారివల్ల జరుగవలసిన వాక్యములు ఏమున్నవో అవన్ని జరిగించి మహిమ పొందుదురని మీ కుమారుని పరిముఖముగా వేడుకొనుచున్నాము. ఆమేన్.

# పరీక్షలు వ్రాయునప్పుడు చేయు ప్రార్ధన

దయగల ప్రభువా! విద్యార్ధులకు పరీక్షలు దగ్గర పడుచున్నవి. అనేకమంది మాకు ఉత్తరములు వ్రాస్తున్నారు గనుక వారిని దీవించుము మరియు వారికి మీ దీవెన దయచేయుమని అడుగుచున్నాము. ప్రార్ధించండని మమ్మును కోరినట్లు వారు మిమ్మును ప్రార్ధించే ప్రేరేపణ దయచేయుము. వారికి విద్యయందు పాటుపడే శ్రద్ధ, సమయము, వీలు, జ్ఞాపకశక్తి, ఆటంకముల నివారణ ఇవన్నీ దయచేయుము. మాకు ఉత్తరములు వ్రాసిన విద్యార్ధుల అందరికి సంపూర్ణ జయము దయచేయుము. వారు పరీక్షలలో జయము పొందనపుడు, ఒకానొక సమయమందు కొందరు స్వహత్య చేసికొనుటకు ప్రయత్నిస్తారు. దయగల ప్రభువా! వారు క్రైస్తవ పిల్లలు, మరియు అన్యుల పిల్లలును మాకు వ్రాస్తున్నారు సంతోషమే. వారికిని నిరీక్షణ గలదు అయితే పరీక్షలలో ఫెయిలగుట వలన ప్రార్ధన నెరవేరలేదని నిరాశపడుదురు గనుక అందరిని కరుణించుమని వారి ప్రార్ధన, మా ప్రార్ధన నెరవేర్చుమని వేడుకొంటున్నాము.

ఓ ప్రభువా! మా కొరకు ప్రార్ధించండి అని ఎందరు మాకు వ్రాసినారో వారందరి యొక్క కోరికలు నెరవేర్చుము. ఇప్పుడు ఇదివరకు

వ్రాసిన కోరికల ఉత్తరములు మీయొక్క సన్నిధానమున పెట్టుచున్నాము కృప దయచేయుము. "మా కొరకు ప్రార్థించండి" అని బేతేలు గృహమునకు ఎవరు వ్రాసిరో, వ్రాస్తారో వారియొక్క కోరికలు నెరవేరునట్లు ఆశీర్వదించుము. ఎవరియొక్క కోరికలు నెరవేరవని మీకు తెలుసునో, వారియొద్ద నుంచి ఉత్తరములు రాకుండా చేయుము. తీరా వచ్చిన తరువాత మొదట ప్రార్థన చేయవలెను గనుక రెండవ ప్రార్థన ఇటువంటి రెండవ ప్రార్థన ఆలకించుమని వేడుకొంటున్నాము. ప్రార్థనలు చేయుట ఎందుకు ప్రభువా! నెరవేరుటకే గదా! నెరవేరని ప్రార్థనలు నా దగ్గరకు రానీయకుము. ఎందుకంటే, లోకములో ఉన్న అన్ని మతముల కంటే, అన్ని మిషనుల కంటే బైబిలు మిషనుకు గొప్ప అంతస్థు ఇచ్చిన లాభమేమి? ప్రార్థన నెరవేరకపోతే. కాబట్టి బైబిలుమిషనుకు అవమానము రాకుండునట్లు మీకు అపకీర్తి కలుగకుండునట్లు ఈ ప్రార్థనలకు ఏర్పాటు కలుగునట్లు దీవించుము. ఆమేన్.

# మరణమును కొట్టివేయు ప్రార్థనలు

## (మృతికి మృతి)

1. దయగల ప్రభువా! మీరు హిజ్కియాకు మరణ శాసనమును ప్రవచించినారు (2రాజులు 20:1-6). అయినను ఆయన ప్రార్థించగా కొట్టివేసినారు, ప్రవచించినవారు మీరే, ప్రార్థించగా కొట్టివేసినవారు మీరే.

2. గవర్నమెంటువారు ఒక ఆజ్ఞ ప్రజలకు ఇచ్చినట్లయితే ప్రజలు అల్లరిచేయగా జి.ఓ (G.O.) కొట్టివేస్తారుగదా! వారు జి.ఓ. కొట్టివేయగా ప్రజలు జి.ఓ. కొట్టివేయబడినదని చెప్పుకొందురు గదా! మొదటిది గ్రంథములోనిది, రెండవది గవర్నమెంటులోనిది ఎత్తి ప్రార్థించుచున్నాము. నేను కాదు, నా స్నేహితులును విజ్ఞాపన చేయుచున్నారు. మీరు విజ్ఞాపన వింటారు గదా! ఎలాగంటే పేతురునకు

రేపు మరణము అనగానే సంఘమంతయు ప్రార్థించగా విని విడిపించినారు గదా! విజ్ఞాపనలు వింటారని మిమ్మును స్తుతించుచున్నాము.

3. మత్తయి 19:26లో మీరు "ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి సమస్తమును సాధ్యమే" అని అన్నారు. యేసుప్రభువా! గోజులాడిన స్త్రీ ఉపమానము మీరే చెప్పినారు. దానిని ఆధారము చేసుకొని రోజూ అడుగుదును గనుక నాకు మరణము కొట్టివేయుము. లూకా 11:5-13లో రొట్టెలను దయచేసిన స్నేహితుని కథ మీరు చెప్పినారు. సిగ్గుమాలి మాటిమాటికి అడిగినందున రొట్టెలు దొరికినట్లు మీరే వ్రాయించినారు. గాన సిగ్గుమాలి అడుగుచున్నాను నేరవేర్చుము.

4. హిజ్కియాకు 15 సంవత్సరాలు ఆయుష్షు ఇచ్చినట్లు నేను 15 సంవత్సరాలు అడుగుటలేదు గాని ఎఫెసీ. 3:21లో ఉన్నట్లు "అడుగు వాటన్నిటికంటెను, ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తి గల దేవునికి మహిమ కలుగునుగాక!", అది ఇది కలిపి ఇమ్మని అడుగుచున్నాను. కాబట్టి ఆయుష్కాలము ఇమ్మని ప్రార్థించుచున్నాము.

5. లూకా 18:1-8లో విసుగకుండా ప్రార్థించమని మీరే అన్నారు, మీరే చెప్పినారు. నాకు విసుగుదల ఉన్నా ప్రార్థించుచున్నాను. శరీర బలహీనతవల్ల విసుగుదల ఉన్నా విసుగుదల ఉన్నదని మీకు తెలుసును గనుక 1) విసుగుదలను, 2) మరణమును కొట్టివేయుము అనికూడా ప్రార్థించుచున్నాను.

6. ముసలితనములో చిగిరిస్తారని దావీదు కీర్తనలు 92:14-15లో ఉన్నది గదా! ఒకవేళ ముసలితనము వచ్చినా చిగిరిస్తారని మీ వాక్యములో మీరే చెప్పిన దానిని ఎత్తుకొని ప్రార్థించుచున్నానుగాని కల్పించుటలేదు గదా!

7. దావీదు కీర్తన 103వ అధ్యా॥లో పక్షిరాజు యౌవ్వనమిస్తారని ఉన్నది గదా! అది ఎప్పుడు నాకిస్తారు? నేను వృద్ధాప్యములో ఉంటే యౌవన

బలమిస్తారని ఉన్నది గదా! అది ఎప్పుడు నాకిస్తారు? నేను వృద్ధాప్యంలో ఉంటే యౌవన బలమిస్తారని వాక్యములో ఉన్నది కావున అది పరలోకములోనే కాదు, ఈ లోకములోనూ ఇస్తారని ప్రార్థించుచున్నాము.

8. మీ నామమందు ఏది అడిగినా ఇస్తాను అని అన్నారు (యోహాను 14:14). వాక్యములో ఉన్నదే అడుగుచున్నాను గాని ప్రభువా! క్రొత్తది ఏది అడుగుటలేదు కావున నా ప్రార్థన నేరవేర్చుము.

9. మార్కు 11:24లో చెప్పినట్లు జరుగక ముందే జరిగినదని నమ్మమన్నారు. జరుగకముందే జరిగిందని నమ్ముటకు ప్రయత్నము చేయుచున్నాను. గనుక నేను నమ్మినట్టేగదా! మీరు త్వరగా నెరవేర్చవలెను అని ప్రార్థిస్తున్నాను.

10. ప్రభువా! సన్నిధి కూటములలో నాకేకాదు, అనేకులకు జవాబు ఇస్తున్నారు గదా! ఈ మరణమును కొట్టివేయుమని అడిగినవానికి కొట్టివేసి, ఎందుకు జవాబు ఇవ్వకూడదని? గోజాడుచున్నాను.

11. ప్రభువా! దుష్టస్వప్నాలు, దుష్టదర్శనాలు, పిశాచి దర్శనాలు కలుగునప్పుడు శరీరములో అనారోగ్యములు, మనస్సులో వేదనలు ఉండును, గనుక అవి కొట్టివేసి ఆదరణ కలుగజేయుమని వేడుకొనుచున్నాను. ఆమేన్.

## ఇంజక్షన్ ప్రార్థన

ఓ దయగల ప్రభువా! సంఘము పూర్వకాలము కంటె ఈ కడవరి కాలములో బైబిలు గ్రంథము విప్పి ఎక్కడ చదువుకొన్నను సరే, ఏ వచనము చదువుకొన్నను సరే ఆ వచనములో నుండి సంఘము యొక్క శరీరములోనికి శక్తి ఇంజక్షన్ వలె వెళ్ళేటట్లు చేయుము. ఆమేన్.

ఓ ప్రభువా! బైబిలులో మాత్రమే కాక మీ భక్తులైన వారు ఆత్మ ప్రేరేపణతో చేసే ఉపన్యాసములు కూడా మాకు, సంఘమునకు మంచి

ఇంజక్షనులు అయ్యేటట్లు మార్చుము. యేసుప్రభువా! అవి మాత్రమే కాక సంఘమునకు కలిగే హింసలు కూడ మంచి ఇంజక్షనులుగా అయ్యేటట్లు మార్చుము. యేసుప్రభువా! ఈ వేళ కూడ మాకు క్రొత్త వర్తమానము దయచేయుము. అది కూడ ఒక ఇంజక్షను అవును గాక! మీకు మహిమ సంఘమునకు జయము. అపవాది క్రియలకు లయము. మీ రక్తము సంఘమునకు పట్టించుము. సంస్కారము ద్వారా మీ రక్తమే సంఘమునకు ఇంజక్షను చేయుము. ఆమేన్.

**గమనిక:–** (అదివరకు చదివేది వేరు. ఈ కడవరి కాలములో ఒక్కసారి చదివేది వేరు. ఇప్పుడు అయ్యగారు చెప్పిన తరువాత చదివేది వేరు. కాగితాలు తిరగవేసి ఎక్కడ చదివినను సరే, ఆకాను, యూదా, అననీయ, సప్పీరాల కథ, కయీను కథ చదివినను సరే. సొదొమ వారి కథలు కంటబడితే ఇవి దుశ్శకునములా ఉన్నవని అనుకొనకుండ చదువుము. దేవుని వాక్యములో దుశ్శకునములు లేవు. అకస్మాత్తుగా చంపే ఇంజక్షన్లు లేవు. అన్ని బలహీనతలను తీసివేసి, బలపరచే ఇంజక్షనులే ఉన్నవని సంతోషించండి).

# దేవోక్తి ప్రార్థన

ఆదామునకు భాష నేర్పిన తండ్రీ! మీకు స్తోత్రము. మానవజాతికి భాష నేర్పిన తండ్రీ! మీకు స్తోత్రములు. లోకములో ఎన్నో లోకోక్తులున్నవి. సర్వోక్తులు, చలోక్తులు, సరసోక్తులు అలంకారోక్తులు పలుకుట లోకమునకు అవసరము. జ్ఞానోక్తులు, జీవోక్తులు, ధీయోక్తులు పలుకుట మీవశము. అయితే తండ్రీ! మీ రాక కొరకు ఎదురు చూచుచు, లోకములో రాకడ వర్తమానము ప్రకటించుచు సిద్ధపడుచున్న మీ బిడ్డలమైన మాకు మీ చిత్తమైతే దేవోక్తి దయచేయుము. ఆదికాలములో ప్రవక్తలద్వారా దేవోక్తులు మాట్లాడినారు. అంత్యకాలము సమీపించగా ప్రవక్తలను పంపుదురని వాగ్ధానము చేసినారు.

యెషయా నోటిని ముట్టి, అగ్నిలో దహించినారు. ఈ రీతిగా మీ చిత్త ప్రకారముగా నా నోరును ముట్టి, పరిశుద్ధాత్మని అగ్నిలో దహించి, మీరే మాలో నుండి దేవోక్తులు మాట్లాడించుము. అవసరమైన దేవోక్తులు వాడుకొనునట్లు మీ కృప దయచేయుమని వేడుకొనుచున్నాను. ఆమేన్.

# భక్తి కూటములో చేయవలసిన స్తుతి ప్రార్ధన

దేవా! ఇట్టి కూటములు పెట్టవలనని తలంపు మాకు కలిగించినారు కనుక మీకు స్తోత్రములు. ఇట్టి తలంపు మీరు మాకు పుట్టించినారు గనుక  మీరే జయము అనుగ్రహింతురు.

మాకు కష్టములు కలుగుకుండ మీరే జయము అనుగ్రహింతురని నమ్మి మిమ్ములను స్తుతించుచున్నాము. హర్మ గెద్దోను యుద్ధంలో ఆయుధములు లేకుండ జయము కలిగించుచున్నట్లు ఇప్పుడును వివాద ఆయుధములు, ప్రార్ధన కూటమును ఆపుచేయు ఆయుధములు, అసంతుష్టి ఆయుధములు మాయొద్దకు రాకుండ చేసెదరని నమ్ముట వలన మిమ్మును స్తుతించుచున్నాము.

మరియు ఇక్కడ ఉన్నవారిలో ఒకరికి మరియొకరి వల్ల బేధాభిప్రాయములు కలుగక మానవు, అట్టి అభిప్రాయముల వలన హాని కలుగనైయుండును. అవి పుట్టినప్పుడే వాటిని అంతరింపజేయుదురని నమ్ముటవలన మిమ్ములను స్తుతించుచున్నాము. మేము ఉండవలసిన రీతుల విషయములోను చేయవలసిన పనుల విషయములోను పొరపాట్లు కలిగి ఉండుట వలన హాని కలుగనైయుండును గనుక వాటిని వెంటనే అంతరింపజేయుదురని నమ్ముట వలన మిమ్మును స్తుతించుచున్నాము. హానికరములగు ఈ ఏడు సంగతులు యుద్ధాయుధముల వంటివై ఉన్నవి గనుక మా ఉజ్జీవ కూటములలో ఒకరికి దర్శనమువలన వచ్చునట్లు యుద్ధ మేఘము కలుగనీయక దానిని ఆపుచేయుదురని నమ్ముటవలన మిమ్మును స్తుతించుచున్నాము.

దేవా! ఒకరికి దర్శనములో వచ్చినట్లు యుద్ధములు ప్రపంచమంతటి మీదకి వచ్చును. అయినప్పటికిని ప్రపంచములో బాంబులు వేసికొనుటలేదు గనుక అవి పడుటలేదు. అలాగే నేడు మా కూటములో కూడ పడకుండ చేయుదురని నమ్ముటవలన మిమ్మును స్తుతించుచున్నాము.

ఇట్టి యుద్ధములు, బాంబులు ఉన్న సమయంలో ముందు మీరు వీటికి కారకుడైన సైతానును అతని దూతలను దూరముగా ఉండి చూడనిచ్చుటయే గాని వాటిని దగ్గరకు రాకుండ చేయుదురని నమ్ముట వలన మిమ్ములను స్తుతించుచున్నాము.

వీటి సైన్యముకంటె సంఖ్యలోను, శక్తిలోను ఎక్కువగా ఉన్న దూతలను మాకు కాపుదల కర్తలుగ నియమించియున్నారు అని నమ్ముట వలన మిమ్మును స్తుతించుచున్నాము. మా స్తుతులను యేసు ప్రభువుద్వారా అంగీకరించుమని వేడుకొనుచున్నాము తండ్రీ. ఆమేన్.

# మేలు బంతి ప్రార్థన

(ఏ మతమును గాని, ఏ మనుష్యుని గాని తుంచనాడకూడదు. తెలియనివి దేవుని అడిగి తెలిసికొనవలెను.)

ఓ దేవా! మా కొరకు ఆకాశమును, భూమిని సృష్టిని చేసిన ప్రభువా! నన్నును, మమ్ములనందరిని కలుగజేసిన తండ్రీ! మీకు అనేక నమస్కారములు.

నా రక్షకా! నా రాజా! మీరు నాకు కనబడుము, నాతో మాటలాడుము, నాకు చెప్పవలసినవి చెప్పుము, అందరికిని చెప్పవలసిన మాటలు కూడ చెప్పుము, నేను అడుగునట్టి ప్రశ్నలన్నిటికి జవాబులు వినిపించుము. ఆయా మతములను గురించి మీ అభిప్రాయమేమి? మీరు చెప్పునది నేను చేయగల శక్తి నాకు దయచేయుము. నా మనసులోనికి సిగ్గు, భయము, అనుమానము, విసుగుదల, నిరాశ, పాపము ఏవి

రాకుండా, నా మనసులో లేకుండా చేయుము. నన్ను ఎప్పటికప్పుడే శుద్ధి చేయుచుండుము. నన్నే కాదు, లోకములోనున్న అందరిని రక్షించుము. సైతాను చేయు ప్రయత్నములు దుంపనాశనము చేయుము. నా శరీరమునకు ఆరోగ్యము, నా జ్ఞానమునకు వృద్ధి, నా మనస్సాక్షికి మంచిచెడ్డలు తెలియగల సమ్మతి అనుగ్రహించుము.

ఈ ప్రార్థన నేను అందరికిని నేర్పగల ధైర్యము, సమయము, వీలు, ఉపాయము, ఆలోచన పుట్టించుము. దేవా! మీకు నా వలన కీర్తి రావలెను అని కోరుచున్నాను. అవసరమైనప్పుడెల్లా ఉపవాస ప్రార్థన చేసికొనగల మనసు, ఓపిక కలిగించుము.

దేవా! నా బోధకుడా! నా కోరికలన్నియు తీర్చుము. జీవాంతమందు నన్ను మీ యొద్దకు చేర్చుకొనుము. సర్వజ్ఞానివైన తండ్రీ! నేను ఏదైన చేయుచున్నప్పుడు అది సరిగా లేనియెడల, 'ఇదిగో మీరు చేయుచున్నది సరిగా లేదు' అని నాకు స్వరముతో స్పష్టముగా చెప్పుము. అలాగే నేను తలంచుచున్న తలంపులలోను, మాటలాడుచున్న మాటలలోను పొరబాటులు ఉన్న యెడల వెంటనే దిద్దుము. మరియు మీకు ఇష్టము లేని వ్రాతలు, నేను చదువుచున్నప్పుడు ఆపివేయుము అని స్వరముతో చెప్పుము. నేను ఎవరికైన విరోధముగా చేసిన తప్పులు, నాకు జ్ఞాపకము! చేసి, వాటిని ఒప్పుకొనునట్లు నన్ను ప్రేరేపించుము, నాకు ఏదైన అపాయము రానైయుండగా, నాకు దాని విషయమై ముందుగానే తెలియజేయుము. అన్ని మతముల వారును తమ తమ మతములయందలి మంచి మంచి ధర్మములను, ఆచారములను ప్రకటించుచు, వాటిని అనుసరించునట్లు వారికి మీ కృపను చూపుము. మీరు కలుగజేసిన వాటిలో దేనినైనను, ఏ జీవినైనను, ఏ మనుష్యునినైనను పూజింపక కేవలము మిమ్ములనే సృష్టికర్తవైన మిమ్ములనే, దేవుడవైన మిమ్ములనే పూజింపవలెనను అనే తలంపు వారిలో స్ఫురింపజేయుము. ఈ నా ప్రార్థనయును నా అన్ని ప్రార్థనలును మీ ఘనమైన నామమును బట్టి నెరవేర్చుము. ఆమేన్.

# VII. సర్వాంశ ప్రార్థనలు

## సర్వాంశ ప్రార్థన

1. ఓ దేవా! మా తండ్రీ! నేను ప్రార్థన చేసుకొనేటందుకు ఈ సమయము దయచేసినందుకు అనేక వందనములు.

2. మీరే మమ్మును కలుగజేసిన తండ్రివైయున్నారు. మీరే మాకు అన్న వస్త్రాదులిచ్చి పోషించే కర్తవైయున్నారు. మీరే మా పాపములు పరిహారము చేసే రక్షకుడవైయున్నారు. మీరే మమ్ములను పాపములో పడకుండ కాపాడే కర్తవైయున్నారు. మీరే మాకు మీ వాక్యము నేర్పించే, బోధించే బోధకుడైయున్నారు. మీరే మమ్ములను చిక్కులలో నుండి తప్పించే ఆదరణ కర్తవైయున్నారు. మీరే మా జబ్బులు బాగు చేసి ఆరోగ్యమిచ్చే వైద్యుడవైయున్నారు. మీరే మాకు అన్నింటిలో ఆధారమైయున్నారు. మీరే మాకు మోక్షమిచ్చే శక్తిమంతుడైయున్నారు. కాబట్టి మీకనేక నమస్కారములు చెల్లించుచున్నాము.

3. ఓ దయగల తండ్రీ! నన్నును, నా స్వజనులను దీవించుమని వేడుకొనుచున్నాము.

4. నా పాపములు క్షమించుము, నా తలంపులలో పాపములు లేకుండా చేయుము, నా చూపులో పాపము లేకుండా చేయుము, నా వినడములో పాపము లేకుండ చేయుము, నా మాటలలో పాపములు లేకుండ చేయుము, నా క్రియలలో పాపములు లేకుండా విసర్జించే శక్తి నాకు దయచేయుమని ప్రార్థించుచున్నాను.

5. మిమ్మును గురించిన సంగతులు ఎవరిచేతనైనను, నాకు తరచుగా చెప్పించుచుండుము. అలాగే పుస్తకములలో మిమ్మును గురించిన సంగతులు చదువుకొనే జ్ఞాన హృదయము దయచేయుదురని నమ్ముచున్నాను.

6. నేను బ్రతికినంతకాలము మీ భక్తిమీద ఉండగల మనస్సు దయచేయుమని వేడుకొనుచున్నాను.

7. ఈ లోకములో నేను బ్రతుకవలసిన బ్రతుకు అయిపోయిన పిమ్మట నన్ను మీ యొద్దకు క్షేమముగా చేర్చుకొనుము. ఓ యేసు క్రీస్తు ప్రభువా! మీరే నాకు సర్వములో సర్వమైయున్నారు. గనుక మీకనేక స్తోత్రములు.

ఓ దేవా! పాపము మీరు కలుగచేయలేదు. దయ్యాలను మీరు పంపలేదు. జబ్బులు మీరు పంపలేదు. ఇబ్బందులు, కరువులు మీరు పంపలేదు, భూకంపము, పిడుగు ఇవి మనుష్యులకు కలుగడము మీకిష్టములేదు. సాతాను చేసిన పాపము వలననే ఇవన్నీ కలుగుచున్నవి. మీరు నాకు కీడుచేసే దేవుడవు కాదు గనుక మీకనేక వందనములు. ఓ యేసుప్రభువా! నేనెల్లప్పుడు మిమ్మును బట్టి నిలువబడే కృప దయచేయుదురని మిక్కిలి వినయముతో వేడుకొనుచున్నాను. ఆమేన్.

# మెట్ల ప్రార్థన

**(దేవునిని ఎట్లు ప్రార్థించిన యెడల మన కోరికలు నెరవేరునో ఆ సంగతులు ఈ పత్రికలో ఉన్నవి)**

మానవ సహకారులారా! మీరు ఏకాంత స్థలమున చేరి, ఈ క్రింది మెట్ల ప్రకారము ప్రార్థించి, మేలు పొందండి.

1. దేవుడు మీ ఎదుట ఉన్నారని అనుకొని నమస్కారము చేయండి. ఇది మొదటి మెట్టు. ఇక ప్రార్థించండి.

2. దేవా! నా పాపములు క్షమించుము. నాకు తెలిసిన ఏ పొరపాటులోను పడకుండ నన్ను కాపాడుము.

3. దేవా! నా శక్తికొలది చెడుగును విసర్జింతును. నా తలంపులో గాని, చూపులోగాని, వినుటలో గాని, మాటలోగాని ప్రయత్నములో గాని, క్రియలోగాని ఏ దుర్బుద్ధి చేరకుండా జాగ్రత్తగా ఉందును.

4. దేవా! నా శరీరమును, నా ప్రాణమును, నా ఆత్మను, నా జ్ఞానమును నా మనస్సాక్షిని, నా యింటిని, నాకు కలిగియున్న సమస్తమును కాపుదల నిమిత్తమై మీ వశము చేయుచున్నాను.

5. సృష్టికర్తవైన దేవా! మీరు ఆది అంతము లేనివారు, అంత గొప్ప దేవుడవు అయినప్పటికిని, మీరు మా తండ్రివి, మా ప్రార్థనలు విందురు గనుక మీకు వందనములు. మీరు జీవము గలవారు, ప్రేమ గలవారు, న్యాయము గలవారు, శక్తి గలవారు, పాపములేని పరిశుద్ధత గలవారు. మీరు అంతటను ఉన్నారు. నా దగ్గరకూడా ఉన్నారు గనుక మీకు వందనములు. మీలో ఉన్న ఈ మంచి గుణములు నాలో కూడా పెట్టినారు గనుక వందనములు.

6. దేవా! తండ్రీ! నాకు కలిగిన ఎన్నో కష్టములు తీసివేసినారు గనుక వందనములు. కష్టములు తొలగించుట మాత్రమే గాక ఎన్నో ఉపకారములు చేసినారు గనుక వందనములు. నేను మిమ్మును ప్రార్థించినను, ప్రార్థించక పోయినను కాపాడినారు గనుక మీకు వందనములు.

7. దేవా! ప్రభువా! నేను మిమ్మును కోరినను, కోరకపోయినను అనేక మేళ్ళు చేసినారు గనుక మీకు వందనములు.

8. దయగల తండ్రీ! నాకు ఏవి అవసరమో అవి దయచేయుము. పోషణ, ఆరోగ్యము దయచేయుము.

9. దేవా! మీరే మా తండ్రివి, మా పోషకుడవు, మా వైద్యుడవు, నాకు విద్యాబుద్ధులు నేర్పు దేవుడవు. నేను ఎల్లప్పుడును మీయందు భక్తి నిలుపగల శక్తిని అనుగ్రహించుము. సమస్తమును అనుగ్రహింపగల సమర్థుడవు. నన్ను మాత్రమే గాక మీరు కలుగజేసిన సమస్తమును దీవించుము. మనుష్యులందరిని రక్షించుము. మిమ్ములను నమ్మిన వారందరిని మోక్షములోనికి చేర్చుకొనుము, నమ్మని వారికి జ్ఞానము

నేర్పుము, నమ్మిక కలిగించుము. అట్టివారిని కూడ మోక్షములోనికి చేర్చుకొనుము.

10. దేవా! నాకు మనుష్య రూపముతో దర్శనములో గాని, స్వప్నములో గాని కనబడుము. నాతో మాట్లాడుము. నేను మిమ్మును ఏమైన అడిగిన యెడల జవాబు చెప్పుము. ఆమేన్.

11. ఇప్పుడేమియు మాట్లాడకుండా నిశ్శబ్ధంగా ఉండి, దేవుడు మీకు ఏమి చెప్పునో వినుటకై కనిపెట్టండి. అప్పుడాయన మీకు నిశ్చయముగా కనబడి మాట్లాడును.

# సర్వలోక సంపూర్ణ ప్రార్ధన

సర్వవ్యాప్తివైన ఓ దేవా! సర్వలోకమునకు మీ సువార్త అందించుము. సర్వమతములవారికి మీ శుభవార్త అందించుము. మీ సంఘం తాను నేర్చుకొనుచున్న విశ్వాసము మాదిరిగా లోకము యెదుట నిలవబడగల శక్తి దయచేయుము. మత తర్కములు, మిషను వివాదములు, తప్పుడు బోధలు, పాప శోధనలు, పాపము వలన కలుగు నష్టములు వీటన్నిటి నుండి మమ్మును తప్పించుము.

కరువు కాలములో, వ్యాధి కాలములో, అజ్ఞాన కాలములో వాటి మూలముగా మానవులను మీ తట్టు త్రిప్పుము. లోకమునకు ఉపకారములుగా ఏర్పడుచున్న అన్ని పనుల మీద మీ దీవెన కుమ్మరించుము. విశ్వాసులను మీ పరిశుద్ధాత్మతో నింపి ప్రభువా మీ రెండవ రాకకు సిద్ధపరచుము.

ప్రతి కుటుంబములోని వారిని, బీదలను, పాఠశాలలను, వైద్యశాలలను, అనాథశాలలను, బైబిలు సొసైటీని, ట్రాక్టు సొసైటీని, అన్ని వృత్తులను, నీటి మీదను, మెట్ట మీదను, నిర్జీవ ప్రదేశములోను,

గాలిలోను ప్రయాణముచేయు ప్రయాణీకులను, ప్రభుత్వమువారి ఏర్పాటులను కాపుదలగల మీ స్వాధీనమందు వర్ధిల్ల చేయుము.

జ్యోతుల మీదను, పక్షుల మీదను, పశ్వాదుల మీదను, వృక్షాదుల మీదను, పంటల మీదను అనగా మీ యావత్తు సృష్టిమీదను నిత్యము మీ కరుణాదృష్టిని ప్రకాశింప చేయుము. ఏ వస్తువును ఏ జీవిని దేవుడు దీవించలేదు అను నేరము మీ మీదకి రానీయకుము.

అన్యాయము, అవమానము, దోపిడీలు, హత్యలు, నిరాశలు, దుర్మరణములు, భూకంపములు, యుద్ధములు ఆకస్మికముగా రానైయున్న అపాయములు మొదలగు గండముల నుండి ప్రజలను విమోచింపుము.

యంత్రములోను, గనులలోను, సొరంగములలోని నీటి అడుగునను పనిచేయు వారిని కాపాడుము. విషపురుగుల నుండియు, క్రూరమృగముల నుండియు, దుర్జనుల నుండియు మమ్ములను తప్పించుము. ఏ అంశ ప్రార్థన మేము మరచిపోతిమో అది మీకు సమర్పించుచున్నాము.

మేము అడుగు వాటన్నిటికంటెను ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయుజూచుచున్న ఓ తండ్రీ, మా అంతరంగ ప్రార్థనలు, మా బహిరంగ ప్రార్థనలు యుక్తకాలమందు నెరవేరునట్లు మా ప్రార్థనా స్తుతులను త్వరగా రానైయున్న "యేసుప్రభువు" ద్వారా ఆలకించుమని వేడుకొనుచున్నాము తండ్రీ! ఆమెన్.

# విషయ సూచిక

| క్రమ సంఖ్య | ప్రార్థనలు | పేజి నెం. |
|---|---|---|


I. **స్తుతి ప్రార్థనలు** - 1-6

1. స్తుతి ప్రార్థన - 1-2
2. త్రికాల స్తుతి హారము - 2-5
3. దేవుని ఔన్నత్య స్తుతి ప్రార్థన - 5
4. కష్టకాల స్తుతి ప్రార్థన - 5-6

II. **స్వీయ ప్రార్థనలు** - 7-28

1. సామాన్య ప్రార్థన - 7-8
2. అనుదిన ప్రార్థన - 8-11
3. ఉదయము లేచినప్పుడు చేయవలసిన ప్రార్థన - 11-12
4. భోజనము చేయునప్పుడు చేయవలసిన ప్రార్థన - 12-13
5. రాత్రికాల ప్రార్థన - 13-14
6. పిల్లలకు నేర్పవలసిన ప్రార్థన - 14-16
7. వేద పఠనముకు ముందు చేయు ప్రార్థన - 16-17
8. బైబిలుమిషను అభిమానులు చేయదగిన ప్రార్థనలు - 17-20
9. కుటుంబ ప్రార్థన - 20-22
10. అందరు చేసికొనవలసిన ప్రార్థన - 23
11. వ్యక్తిగత ప్రార్థన - 23-25
12. కాపుదల ప్రార్థన - 25-26
13. అన్ని అక్కరలు తీర్చే ప్రార్థన - 27-28

III. **స్వస్థత ప్రార్థనలు** - 28-39

1. తైలము కొరకైన ప్రార్థన - 28-30
2. స్వస్థి ప్రార్థనలు - 30-32
3. స్వస్థత ప్రార్థన - 32-33
4. జబ్బుగా ఉన్నవారి కొరకు ప్రార్థనలు - 33-34


Bible Mission HQ Guntur

| | | |
|---|---|---|
| | 5. రోగులు చెసికొనవలసిన ప్రార్థనలు | - 34-35 |
| | 6. దైవిక స్వస్థత ప్రార్థనలు | - 35-37 |
| | 7. శుద్ధి ప్రార్థన | - 37-38 |
| | 8. విశ్వాస స్వస్థి ప్రార్థన | - 38-39 |
| IV. | **సృష్టి కొరకైన ప్రార్థనలు** | - 39-46 |
| | 1. సృష్టికొరకైన ప్రార్థన | - 39-40 |
| | 2. సృష్టికర్తకు చేయు స్తోత్ర ప్రార్థన | - 40-42 |
| | 3. వేసవి ప్రార్థన | - 43-44 |
| | 4. వర్ష ప్రార్థన | - 44-45 |
| | 5. నీటి కొరకైన ప్రార్థన | - 45-46 |
| V. | **సైతాను బంధించు ప్రార్థనలు** | - 46-52 |
| | 1. సాతానును బంధించు ప్రార్థన | - 46-48 |
| | 2. సాతానును బంధించుట | - 48-49 |
| | 3. దయ్యములను వెళ్లగొట్టు ప్రార్థన | - 49 |
| | 4. అంధకారముపై అధికారమునిచ్చే ప్రార్థన | - 49-52 |
| VI. | **సందర్భ ప్రార్థనలు** | - 52-60 |
| | 1. జన్మదిన ప్రార్థన | - 52-53 |
| | 2. పరీక్షలు వ్రాయునప్పుడు చేయు ప్రార్థన | - 53-54 |
| | 3. మరణమును కొట్టివేయు ప్రార్థన | - 54-56 |
| | 4. ఇంజక్షన్ ప్రార్థన | - 56-57 |
| | 5. దేవోక్తి ప్రార్థన | - 57-58 |
| | 6. భక్తికూటములో చేయువలసిన ప్రార్థన | - 58-59 |
| | 7. మేలు బంతి ప్రార్థన | - 59-60 |
| VII. | **సర్వాంశ ప్రార్థనలు** | - 61-65 |
| | 1. సర్వాంశ ప్రార్థన | - 61-62 |
| | 2. మెట్ల ప్రార్థన | - 62-64 |
| | 3. సర్వలోక సంపూర్ణ ప్రార్థన | - 64-65 |


Bible Mission HQ Guntur

# ప్రార్థనా మంజరి

గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**

గుంటూరు - 2026 చందా : 20.00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 2009 | ప్రతులు | 5000 |
| రెండవ | ముద్రణ | 2010 | ప్రతులు | 5000 |
| మూడవ | ముద్రణ | 2011 | ప్రతులు | 10000 |
| నాల్గవ | ముద్రణ | 2012 | ప్రతులు | 5000 |
| ఐదవ | ముద్రణ | 2013 | ప్రతులు | 5000 |
| ఆరవ | ముద్రణ | 2014 | ప్రతులు | 10000 |
| ఏడవ | ముద్రణ | 2015 | ప్రతులు | 10000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2016 | ప్రతులు | 5000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2017 | ప్రతులు | 5000 |
| పదియవ | ముద్రణ | 2018 | ప్రతులు | 10000 |
| పదకొండవ | ముద్రణ | 2019 | ప్రతులు | 5000 |
| పన్నెండవ | ముద్రణ | 2020 | ప్రతులు | 5000 |
| పదమూడవ | ముద్రణ | 2021 | ప్రతులు | 5000 |
| పదునాల్గవ | ముద్రణ | 2022 | ప్రతులు | 6000 |
| పదిహేనవ | ముద్రణ | 2023 | ప్రతులు | 3000 |
| పదహారవ | ముద్రణ | 2024 | ప్రతులు | 8000 |
| పదిహేడవ | ముద్రణ | 2025 | ప్రతులు | 5000 |
| పద్దెనిమిదవ | ముద్రణ | 2026 | ప్రతులు | 2000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.